
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 15.05.2015, శుక్రవారం సంపుటి : 34 సంచిక : 50 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



# అయ్యోారికి క్లాసు పీకారు

## ● నారాయణను ఉతికి ఆరేసిన జిల్లా టిడిపి నేతలు ● శివమెత్తిన ఆదాల, పోలంరెడ్డి, సోమిరెడ్డి, బీద

**రాష్ట్రంలో నా మాటకు తిరుగులేదు... నేను ఏది చెబితే అదే... చంద్రబాబు కూడా నా మాట వినాల్సిందే... రాష్ట్రంలో చంద్రబాబు తర్వాత నేనే నెంబర్ టూ... పార్టీలో సీనియర్లు లేదు... తొక్కా లేదు. నా మాటే వేదం అన్నట్లు అహంభావంతో, అధికార గర్వంతో విర్రవీగుతున్న మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ తలపొగరు దించారు నెల్లూరు తెలుగుతమ్ముళ్లు.**

నారాయణ మూలంగా జిల్లాలో తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు పడుతున్న కష్టాలను ఇంతకాలం ఓర్పుగా భరిస్తూ, తమకు ఎదురైన అవమానాలను తట్టుకుంటూ ఓపిక పట్టిన జిల్లా తెలుగుదేశం నాయకులు ఒక్కసారిగా అగ్నిపర్వతాల్లా పేలిపోయారు. నారాయణను విమర్శల లావాగ్నిలో ముంచెత్తారు. అతని చొక్కా పట్టుకుని నువ్వెంత, నీ అధికారమెంత అంటూ దుమ్ముదులిపినంత పని చేశారు. మంత్రి నారాయణకు నలుగుపెట్టి నాలుగు తిట్టే ఈ రాజకీయ వేడుకకు నెల్లూరీయుడైన హైదరాబాద్‌లోని ఆచార్య జయరామిరెడ్డి నివాసం వేదిక కావడం గమనార్హం.

నారాయణ మంత్రి అయ్యాక ఇంతటి అవమానం ఎప్పుడూ ఎదురై ఉండదు. వివరాలలోకి వెళితే... త్వరలో నెల్లూరులో మినీ మహానాడు నిర్వహించనున్నారు. దీనికి ముందుగానే పార్టీ జిల్లా అధ్యక్షుడి ఎంపిక కూడా జరగాల్సి ఉంది. జిల్లా పార్టీ అధ్యక్షుడు బీద రవిచంద్ర చొరవతో జయరామిరెడ్డి ఇంట్లో జిల్లా పార్టీ నేతల సమన్వయ సమావేశం ఏర్పాటు చేసారు. జయరామిరెడ్డితో పాటు ఎమ్మెల్సీ వి.వి.వి. చౌదరి, మంత్రి నారాయణ, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, బొల్లినేని రామారావు, కురుగొండ్ల రామకృష్ణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర, నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్‌ల హోదాలో ఆదాల ప్రభాకర్‌రెడ్డి, గూటూరు కన్నబాబు, బీద మస్తాన్‌రావులు హాజరయ్యారు.

దాదాపు 11నెలలుగా జిల్లా పార్టీ నేతలు మంత్రి నారాయణ వ్యవహారశైలిపై మండిపోతున్నారు. అయితే ఆ మంటనంతా ఇన్నాళ్ళూ వాళ్లు కడుపులోనే దాచుకున్నారు. కాని ఎంతకీ నారాయణ వ్యవహారశైలి మారకపోవడంతో తమ ఆగ్రహాన్ని వెళ్లగక్కక తప్పలేదు. ఈ సమన్వయ సమావేశం ఇందుకు బాగా ఉపయోగపడింది. ముందుగా కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి (మిగతా 3వ పేజీలో)



11లో

## కావలిలో లాయర్ కార్యాలయం



12లో

## 'అ'న్యాయాన్ని ప్రశ్నిస్తున్న తీర్పులు





ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ... ఎప్పుడూ నష్టాల్లో ఉంటుంది. మొన్న, నిన్న, నేడే కాదు రేపు కూడా దీని బ్రతుకింతే. దాని తలరాత అంతే. ఈ రాష్ట్రంలో ఎవరికి కోపం వచ్చినా, ఎవరు ఆందోళనకు దిగినా, ఎవరు బంద్‌లు చేసినా ముందుగా ఆగేది ఆర్టీసీ బస్సులే! మొదటి రాయి పడేది ఆ బస్సు మీదే! మొదటిగా తగలబడేదీ ఆర్టీసీ బస్సులే! చివరకు ఆర్టీసీని నడిపే కార్మికులు సమ్మెకు దిగినా నష్టపోయేది ఆ సంస్థే.

# ముగిసిన సమ్మె... కదిలిన బస్సులు

అసలే ఏపిఎస్ఆర్టీసీ అప్పులు, అవస్థల మధ్య నడుస్తోంది. గత ఏడాదంతా కూడా సమైక్యాంధ్ర, తెలంగాణ ఉద్యమాలతో ఆర్టీసీకి నష్టాలు, కష్టాలే! తాజాగా ఇప్పుడు ఆర్టీసీ కార్మికులే తమకు 43 శాతం ఫిట్‌మెంట్ పెంచాలని డిమాండ్ చేస్తూ సమ్మె బాట పట్టారు. 7రోజుల పాటు ఎక్కడి బస్సులు అక్కడే నిలిచిపోయాయి. ఎట్టకేలకు కార్మికుల డిమాండ్‌కు ప్రభుత్వం తలవంచడంతో బుధవారం సాయంత్రం నుండి కార్మికులు సమ్మె విరమించారు. బస్సులు రోడ్ల మీదకు వచ్చాయి. కార్మికుల సమ్మె మూలంగా ఆర్టీసీకి తీవ్ర నష్టం వాటిల్లింది. మేనెలలో నెల్లూరుజిల్లాలోనే ఆర్టీసీ ఆదాయం రోజుకు కోటిరూపాయల దాకా ఉండేది. ఈ నెలలో పెళ్లిళ్ల ఎక్కువ. దీనికి తోడు వేసవి సెలవులు కావడంతో ప్రయాణీకులు ఎక్కువుగా ఉంటారు. ఈ నెలంతా కూడా ఆర్టీసీ ఆదాయం బాగా పెరుగుతుండేది. అయితే ఇదే నెలలో కార్మికులు సమ్మెకు దిగడంతో ఆర్టీసీ ఆదాయానికి గండి కొట్టినట్లయ్యింది. తాత్కాలిక సిబ్బందిని ఏర్పాటు చేసి పోలీసు బందోబస్తుతో కొన్ని బస్సులను తిప్పుతున్నా ప్రయాణీకులకు పెద్దగా ఉపయోగపడింది లేదు. మొత్తానికి ఈ సమ్మెతో ఆర్టీసీ పరిస్థితి మూలిగే నక్క మీద తాటికాయపడ్డట్లయ్యింది. వారం రోజుల తర్వాత ఆర్టీసీ యాజమాన్యం, కార్మికుల మధ్య చర్చలు ఫలించి కథ సుఖాంతమైంది.

# కూర్చుని మాట్లాడుకున్నారు

## కలెక్టర్ చొరవతో రైతుల మధ్య రాజీ

ఉన్నతాధికారులు సమయస్ఫూర్తిగా వ్యవహరించి రెండు మండలాల రైతులను శాంతంగా కూర్చోబెట్టి మాట్లాడడంతో ఒక సాగునీటి సమస్య పరిష్కారమైంది.

కండ్లేరు ఎడమకాలువ ఆయకట్టు పరిధిలో పొదలకూరు, చేజర్ల మండలాల రైతుల మధ్య వివాదం రాజుకుంది. ఈ కాలువ పరిధిలోని ఆయకట్టులో పంటలను కాపాడేందుకు 60లక్షల ఖర్చుతో తాత్కాలిక ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసారు. రిజర్వాయర్‌లోని నీటిని పంపింగ్ ద్వారా కాలువలోకి మళ్లిస్తున్నారు. ఈ నీటిని ఎక్కువ భాగం చేజర్ల మండలం రైతులే వాడుకుంటున్నారని, తమ పొలాలకు నీళ్లు అందడం లేదని పొదలకూరు మండల రైతులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. చేజర్ల మండలంలో కాలువగట్టుపై ఏర్పాటు చేసిన మోటార్లను తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు. దీంతో ఈ మండలాల రైతులు కలెక్టర్‌ను కలిసి నీళ్లు లేక తమ పంటలు ఎండిపోతున్నాయని మొరపెట్టుకున్నారు. రైతులను కూర్చోబెట్టి ఈ సమస్యను పరిష్కరించమని కలెక్టర్ నెల్లూరు, ఆత్మకూరు ఆర్డీఓలను ఆదేశించారు. ఈ నెల 12వ తేదీన నెల్లూరు ఆర్డీఓ వెంకటేశ్వర్లు, ఆత్మకూరు ఆర్డీఓ వెంకటరమణలు చేజర్ల మండలంలోని నూతక్కివారికండ్రిక గ్రామంలో ఇరుమండలాల రైతులతో సమావేశం నిర్వహించారు. ఇరు మండలాలలో పంటల విస్తీర్ణం, నీటి అవసరాన్ని లెక్కేసారు. పొదలకూరు మండలంలో పొలాలకు ఏడురోజులు, చేజర్ల మండలంలోని పొలాలకు మూడురోజులు నీళ్లిచ్చేలా ఒప్పందం కుదిర్చి అందరినీ శాంతపరచి పంపించారు.

# సామాజిక భద్రత పథకాలకు ప్రచారం



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సామాజిక భద్రత పథకాలకు విస్తృత ప్రచారం కల్పించాలని జిల్లా పరిషత్ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి అన్నారు. ఈ నెల 9న పాత జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సురక్ష బీమాజీవనయోజన, అటల్ పెన్షన్ యోజన పథకం, ప్రధానమంత్రి జీవనజ్యోతియోజన బీమా యోజన పథకం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని సమావేశం జరిగింది.

ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ లోగడ ప్రధానమంత్రి ప్రవేశపెట్టిన జనధన యోజన పథకం బాగా విజయవంతం అయిందన్నారు. ఈ పథకం ద్వారా ప్రతి కుటుంబం వారు జీరో బ్యాలెన్స్‌తో బ్యాంక్ అకౌంట్ తెరుచుకోవడానికి అవకాశం కలిగిందన్నారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమా యోజన పథకం గురించి ఆయన మాట్లాడుతూ ఈ పథకం 18-50సంవత్సరాల వరకు పెట్టడం జరిగిందని, కాని నేడు జీవన ప్రమాణాలు పెరగటం వలన దానిని 70సంవత్సరాలకు పెంచితే బాగుంటుందన్నారు.

శాసనమండలి సభ్యులు వాకాటి నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి ప్రవేశపెడుతున్న సామాజిక భద్రతా పథకాలు పేద ప్రజలకు చేరేలా తగు ప్రచారం చేయాలన్నారు. నెల్లూరురూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ సామాజిక భద్రత పథకాలకు తనవంతు పూర్తి మద్దతు ఉంటుందన్నారు. క్రొత్తగా కేంద్రప్రభుత్వం తీసుకొనివస్తున్న సామాజిక భద్రత స్కీములు గురించి స్వచ్ఛంధ సేవాసంస్థల వారు, రాజకీయపార్టీల వారు ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ప్రారంభిస్తున్న సామాజిక భద్రత పథకాలపై గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్‌కలెక్టర్ ఎ.యం.డి.ఇంతియాజ్, సిండికేట్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ కృష్ణ, లీడ్‌బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వర్‌రావు, లబ్ధిదారులు, బ్యాంకర్లు, బీమా కంపెనీ వారు పాల్గొన్నారు.

# అడుగంటుతున్న సోమశిల



సోమశిల జలాశయంలో నీటి మట్టం అంతకంతకూ తగ్గిపోతోంది. ప్రస్తుతం నీటి మట్టం డెడ్‌స్టోరేజీకి 7.5 టిఎంసిలకు చేరుతోంది. గత ఏడాది 55 టిఎంసిల నీరు జలాశయానికి చేరినా, కండలేరుకు, పంటల సాగుకూ నీటిని విడుదల చేయడంతో ఇక్కడ నీటి నిల్వ తగ్గిపోయింది. ఇదిలావుంటే, ఈనెలలో మండుతున్న వేసవి ఎండల ధాటికి 1.5టిఎంసిల నీరు ఆవిరయ్యే అవకాశం వుందని అధికారులు భావిస్తున్నారు. అదేవిధంగా, ఈ సీజన్‌లో నెల్లూరు ప్రజల తాగునీటి అవసరాల కోసం మరో 1.5 టిఎంసిల నీరు విడుదల చేయాల్సి వుంది. ఇవి పోగా, జలాశయం నీటిమట్టం డెడ్‌స్టోరేజ్‌కి చేరుకుని, 7.5 టిఎంసిలకు చేరువవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

## రైలు ప్రమాదంలో

# ఎమ్మెల్యే కిలివేటి సోదరుని మృతి

నెల్లూరుజిల్లా సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సోదరుడు సుజయ్(42) గత నెల 25న మృతి చెందినట్లు రైల్వే పోలీసులు నిర్ధారించారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు నలుగురు తమ్ముళ్ళు, ఇద్దరు చెల్లెళ్లు వున్నారు. రెండవ తమ్ముడైన సుజయ్ ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. కనిపించకుండాపోయిన సుజయ్ కోసం కుటుంబసభ్యులు, బంధువులు వెతికి అతని జాడ తెలియకపోవడంతో రైల్వే పోలీసులను సంప్రదించి సుజయ్ ఫోటో చూపించారు. పోలీసులు తమ వద్దనున్న మృతుల ఫోటోను కిలివేటి సోదరులకు చూపించారు. అందులో సుజయ్ ఫోటో ఉండడాన్ని గుర్తించారు. గత నెల 25న లోకల్ ట్రైన్ ఢీకొని బ్రిడ్జి సమీపంలో సుజయ్ చనిపోయాడని రైల్వే పోలీసులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు కాదలూరు గ్రామంలోని ఆయన ఇంటికి చేరుకుని కిలివేటికి తమ సంతాపాన్ని తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో వైయస్సార్సీపి రాష్ట్ర సిఈసి సభ్యులు దబ్బల రాజారెడ్డి, దువ్వూరు గోపాలరెడ్డి, పెళ్లకూరు ఎంపిపి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, కట్టా రమణారెడ్డి, సూళ్లూరుపేట మునిసిపల్ ఛైర్‌పర్సన్ ఎన్.విజయలక్ష్మి, వైస్‌సర్పంచ్ ఈశ్వరమ్మ తదితరులు వున్నారు.

# 10వ వర్ధంతి

మరువలేని నీ తీపి జ్ఞాపకాలతో
నిత్యం నీ మధురస్మృతులతో

భర్త
**కె.వి.రమణయ్య**
సీనియర్ పాత్రికేయులు

కుటుంబ ఉన్నతికి అహర్నిశలు
శ్రమించిన మా యింటి దైవం
ఉన్నతమైన వ్యక్తిత్వంతో అందరి
మంచి కోరుకునే మా ఇంటిదీపం
మా అమ్మను స్మరిస్తూ...



జననం 10-04-1941 | మరణం 20-05-2005

**శ్రీమతి కనుపర్తి రమాదేవి**

| కుమారులు - కోడళ్లు | కుమార్తెలు - అల్లుళ్లు |
| --- | --- |
| కనుపర్తి రామకృష్ణప్రసాద్ - మీన | సీతాలక్ష్మి - దంటు విశ్వనాథ సూరి |
| మృదుల | మానస, మౌనిక |
| కనుపర్తి దయాశంకర్ - రేణుక | జ్యోతిలక్ష్మి - చుండి వెంకటనరసింహశర్మ |
| నితిన్, నందిక | మేఘన, కౌశిక్ |

# అయ్యోరికి క్లాసు పీకారు

(మొదటిపేజీ తరువాయి)

మంత్రికి క్లాసు పీకే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నన్ను ఎమ్మెల్యేననుకుంటున్నారా... గాడిదననుకుంటున్నారా, విజయవాడలో జరిగిన ఇరిగేషన్ సమావేశానికి నన్నెందుకు పిలవలేదు. ఇన్‌ఛార్జ్‌లను పిలిచి ఎమ్మెల్యేలను పిలవకపోవడంలో అర్థమేంటి? మంత్రి అన్నాక కొన్ని సంప్రదాయాలు పాటించండి... గతంలో మంత్రులుగా చేసిన వాళ్లున్నారు, తెలుసుకోండి... పద్ధతి పాటించండంటూ పోలంరెడ్డి వీరపీకుడు పీకాడు. పోలంరెడ్డి మంత్రిని కడిగే సమయంలో గూటూరు కన్నబాబు జోక్యం చేసుకోబోయారు. ఈ దశలో ఆదాల ప్రభాకర్‌రెడ్డి అతనిని వారించి, స్నాక్స్, జ్యూస్‌లు ఇచ్చే పనిలో ఉన్నట్లున్నావ్, ఆ పని చూసుకో, ఇక్కడ ఎవరి సమస్యలు వాళ్లు బయటపెట్టడానికొచ్చారని మందలించాడని తెలిసింది. పోలంరెడ్డి తర్వాత ఆదాల కూడా దులుపుడు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. నువ్వు ఎప్పుడొస్తావో తెలియదు, ఎప్పుడు పోతావో తెలీదు, అర్ధరాత్రిళ్లు ఎక్కడుంటావో, ఎవరితో ఉంటావో తెలీదు. అర్ధరాత్రి సమీక్షలతో లాభమేముంది? మేం ఎక్కడికొచ్చి మిమ్మల్ని కలవాలి అంటూ ఆదాల నిలదీసాడు. తన ప్రోగ్రామ్‌ను పార్టీ అధ్యక్షుడు బీద రవిచంద్రకు చెబుతున్నానని నారాయణ తప్పించుకునే ప్రయత్నం చేశారు. తనకు గంట, రెండు గంటలు ముందు చెబితే ఎవరికి చెప్పగలనని రవిచంద్ర చురుగ్గా తగిలించారు. బీద మస్తాన్‌రావు కలుగజేసుకుని రవిచంద్రను ఈ వ్యవహారంలో ఇరికించొద్దని మంత్రికి హితవు చెప్పారు. గతంలో ప్రతిపక్షంలో ఎమ్మెల్యేగా పనిచేసానని, అధికారపార్టీ మంత్రులు వచ్చేటప్పుడు రెండురోజుల ముందే చెప్పేవాళ్లని, ఇప్పుడా పద్ధతి లేకుండానే పోయిందని తనదైన శైలిలో మంత్రికి కోటింగ్ ఇచ్చారు. ఆదాల అయితే... మీరు అంతగా బిజీ అయితే మీ పిఏల చేత ఫోన్ చేయించండని, అంతే గాని మంత్రి పర్యటనను పత్రికలలో చూసి తెలుసుకునే ఖర్మ రానీయొద్దని కోరాడు. ముఖ్యంగా జిల్లా అభివృద్ధి విషయంపై నారాయణను విదిలించి పడేసారు. అధికారంలోకి వచ్చి ఏడాదైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు మన జిల్లాకు ఎన్నో పనులు ప్రకటించాడు. నెల్లూరు చుట్టూ విడతలవారీగా రింగ్‌రోడ్డు వేస్తామని చెప్పాం. మైపాడు, కొత్తకోడూరు బీచ్‌ల రోడ్ల విస్తరణ, టూరిజం అభివృద్ధి గురించి హామీ ఇచ్చారు. నెల్లూరు చుట్టుపక్కల రైస్‌మిల్లులను ఇక్కో సెజ్‌కు తరలించే ప్రతిపాదన వుంది. పొదలకూరు వద్ద అటవీ భూములున్నాయి. వాటిని డీ-నోటిఫై చేస్తే అక్కడకు పరిశ్రమలు వచ్చే అవకాశముంది. వీటిలో ఏ ఒక్క ఫైలునైనా మీరు కదిలించారా? ఈ ఏడాది 75టిఎంసీల నీళ్లు అందినా కనుపూరు కాలువ, బండేపల్లి కాలువల క్రింద పంటలను ఎండబెట్టుకోవాల్సి వచ్చింది. సాగునీటి విషయంలో అనుభవమున్న నన్ను కాని, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని గాని మీరు సలహా అడిగిన పాపాన పోలేదు. రెండు రిజర్వాయర్ నిర్మాణాలు సగంలో ఆగిపోయి వున్నాయి. ఏదో అర్ధరాత్రిళ్లు వస్తారు, తెల్లారేసరికి తుర్రుమంటూ పోతారు. మీరు అర్ధరాత్రిళ్లు ఎక్కడో పడుకుంటే మేము అక్కడకు రావాలా? అంటూ ఆదాల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రెడ్డి కుల ప్రస్తావనను ఆదాల ఎత్తారు. జిల్లాలో ఆరు శాతం రెడ్లే వున్నారు, వీళ్లను తొక్కేస్తానని పలుచోట్ల మీరు అన్నట్లు తెలిసింది! ప్రత్యేకంగా ఒక కుల ప్రస్తావన తెచ్చి మాట్లాడడం పార్టీకి అవసరమా? అని ఆయన నారాయణను దుయ్యబట్టారు.

ఇక సోమిరెడ్డి అయితే నారాయణను మాటల తూటాలతో ఆడుకున్నాడు. మంత్రులు ఎలా వుండాలి, ఎలా నడుచుకోవాలి, ఎలా మెలగాలి అనే దానిపై నారాయణకు క్లాసు పీకారు. నేను ఇన్‌ఛార్జ్‌గా వున్న సర్వేపల్లి నియోజకవర్గంలోనే నాకు తెలియకుండా కార్యక్రమాలు పెట్టుకున్నావు. విక్రమసింహపురి విశ్వవిద్యాలయానికి ముఖ్యమంత్రి చేత శంకుస్థాపన చేయిద్దామనుకున్నాం, నువ్వు హడావిడిగా గంటా శ్రీనివాసరావును తీసుకొచ్చావు. నా నియోజకవర్గ కార్యకర్తలే ఎన్నోసార్లు మంత్రి ఇలా చేస్తున్నాడేంటన్నా అని నన్ను అడిగారు. పార్టీ గౌరవం కోసం నేను వాళ్లకు సర్ది చెప్పాను అంటూ సోమిరెడ్డి తన కోటా ఇచ్చారు. సమావేశంలో ఒక్క కురుగొండ్ల, కన్నబాబులు మంత్రికి అండగా నిలిచే ప్రయత్నం చేయగా ఆదాల వారిని కూడా మందలించి కూర్చోబెట్టినట్లు తెలిసింది.

దాదాపు రెండు గంటల పాటు ఈ సమావేశం వాడివేడిగా జరిగింది. కురుగొండ్ల, కన్నబాబులు తప్ప మిగతా నాయకులందరూ నారాయణకు తల వాచేలా చీవాట్లు పెట్టారు. చివరిలో వి.వి.వి. చౌదరి, జయరామిరెడ్డిలు జోక్యం చేసుకుని పార్టీ కోసం అందరూ సమన్వయంతో పనిచేయాలంటూ శాంతపరిచారు.

విద్యావేత్తగా సుదీర్ఘ అనుభవం కలిగిన నారాయణ తన జీవితంలో ఎంతో మంది విద్యార్థులకు క్లాసులు పీకి ఉంటారు. కాని తనకు కూడా క్లాసు పీకించుకునే పరిస్థితి వస్తుందని ఊహించి వుండరు. రాజకీయం వేరు, చదువుల వ్యాపారం వేరు. ప్రైవేట్ విద్యలో పూర్తి వ్యాపారమే ఉంటుంది. రాజకీయాలలో వ్యాపార ఆనవాళ్లు ఎక్కువగా వున్నా, ప్రజలకు కొంతన్నా సేవచేయాలనే తత్వం వుంది. కాని నారాయణ రాజకీయాన్ని కూడా నూరుశాతం వ్యాపారంగా చూసుకున్నాడు. మంత్రి అయ్యింది మొదలు ఆయన అదేవిధంగా వ్యవహరిస్తున్నాడు.

ఈరోజు జిల్లా నాయకులు క్లాసు పీకినంత మాత్రాన ఆయనలో మార్పు వచ్చి ఉత్తమ ప్రజానాయకుడిగా మారుతాడనుకోలేం. ఆయనకు ప్రజాసేవ చేయాలని, తన సొంత జిల్లా నెల్లూరును అభివృద్ధి పథంలో నడపాలని, తదుపరి ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆదాయం లేని ఆలోచనలు లేవు. గత ఎన్నికల్లో చంద్రబాబుకు ఆర్థికంగా సహకరించాడు. దానికి ప్రతిఫలంగానే మంత్రి పదవి వచ్చింది. రాజధాని నిర్మాణం అనే వ్యాపారాన్ని ఆయనకు అప్పగించారు. గత ఎన్నికల్లో నారాయణ పెట్టిన పెట్టుబడికి ఎక్కడో ఒకచోట రాబడి ఉండాలి కాబట్టి రాజధానిని ఆయనకు అంటగట్టారు.

రాజధాని ప్రాంతంలో రైతుల కడుపు కొట్టి భూములు లాక్కోవడానికే ఆయన సమయమంతా సరిపోతుంది. ఇక జిల్లా మీద ఆయనకు శ్రద్ధ ఎక్కడుంటుంది. ఇక్కడ పనులు చేస్తే, ప్రాజెక్టులు వస్తే, ప్రజల సమస్యలు పరిష్కరిస్తే ఆయనకొచ్చే ఆదాయమేమిటి? ఆయనకు నెల్లూరు అవసరం లేదు, నెల్లూరు జిల్లాలో పార్టీ అవసరం లేదు. కాబట్టే మంత్రి అయ్యి అవగానే వైయస్సార్ కాంగ్రెస్, కాంగ్రెస్ నాయకులను పార్టీలో చేర్చుకున్నాడు. ఏళ్ల తరబడి పార్టీకి చాకిరీ చేసిన రమేష్‌రెడ్డి, డాక్టర్ జడ్.శివప్రసాద్ లాంటి వారిని పార్టీలో నుండి పోండంటూ హూంకరించాడు. గత 30ఏళ్లుగా ఉన్న పార్టీ పద్ధతులకు పూర్తిగా తిలోదకాలిచ్చాడు. జిల్లాకు ఈ పని కావాలంటూ ఏరోజూ ఆయన ముఖ్యమంత్రిని అడగలేదు. కనీసం జిల్లాలో పార్టీ నాయకులు, కార్యకర్తలకు పదవుల పరంగా న్యాయం చేసే ప్రయత్నం చేయలేదు. అంతెందుకు జిల్లా మంత్రిగా నారాయణ గట్టిగా అడిగి వుంటే మొన్న ట్రిప్పులోనే బీద రవిచంద్ర ఎమ్మెల్సీ అయ్యుండేవాడు. మంత్రి నారాయణ వల్ల మేం ఈ పని చేయించుకోగలిగాం, ఈ విధంగా ప్రయోజనం పొందగలిగాం అని చెప్పుకోవడానికి ఎవరూ లేరు. ఈ జిల్లాకు మంత్రి ఉన్నా లేనట్లే! నారాయణను జిల్లా మంత్రిగా చెప్పుకోవడం కంటే కూడా, ఈ జిల్లాకు మంత్రి లేడనుకోవడం ఉత్తమం. పేరుకు మంత్రే అయినా అతను చదువుల వ్యాపారి. మంత్రి అయినంత మాత్రాన వ్యాపారాన్ని వదులుకుని ప్రజాసేవ చేస్తాడని, వ్యాపారం మానుకుని నాయకులకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటాడని ఆశించడం అమాయకత్వమే అవుతుంది.

తెలుగుదేశం పార్టీ ఓ వ్యాపార సంస్థ లాగా దానికి చంద్రబాబు, లోకేష్‌లు యజమానులైతే తాను సిఇఓనని, మిగతా మంత్రులు, ఎం.ఎల్.ఏలూ ఉద్యోగస్తులనీ నారాయణ భావిస్తున్నట్లుంది. వ్యాపారంలో వేసే ట్రిక్కులు జిమ్మిక్కులు రాజకీయాలలో పనికిరావు. ముఖ్యంగా పార్టీ కోసం కోట్లు ఖర్చుపెట్టుకుని ఎమ్మెల్యేలుగా వున్నవారిని ఉద్యోగస్తులుగా చూస్తే పరిస్థితి తారుమారైపోతుంది. మహామహా నాయకులను సైతం ఎమ్మెల్యేలు మూడు చెరువుల నీళ్లు త్రాగించారు. తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకుడు స్వర్గీయ ఎన్.టి.రామారావు పెద్ద ఉదాహరణ. పార్టీలు, పదవులు శాశ్వతం కాదు, మంచి మర్యాద శాశ్వతం. ఇది తెలుసుకోగలిగితే ముందు ముందు మంత్రికే మంచిది.

## పోలీసులే దొంగలయ్యారు...

# 82 లక్షలు దోచేసి దొరికారు

• కావలి వ్యాపారులలో కలకలం...

ప్రకాశం జిల్లాకు చెందిన ముగ్గురు ఏఆర్ కానిస్టేబుళ్లు ఓ పాత నిందితుడుతో కలిసి గురువారం చెన్నై వైపు వెళ్తున్న నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌లో భారీ దోపిడీకి పాల్పడ్డారు. కావలి నుండి చెన్నైకు బంగారు కొనుగోలు కోసం వెళ్తున్న సీజన్ బాయ్స్‌ను తనిఖీల పేరుతో పడుగుపాడు వద్ద దించేసి కార్లో ఎక్కించుకున్నారు. వారిని గౌరవరం దాకా తీసుకెళ్లి అక్కడ చెక్‌పోస్టు వుండడంతో వారిని దించేశారు. వారి వద్ద వున్న 82లక్షల నగదుతో వీళ్ళు కారులోనే ఉడాయించారు. కావలి దాటాక చేవూరు వద్ద కారును అక్కడే ఆపేసి అడ్డదారి పట్టారు. ఈ దోపిడీపై పోలీసులు వెంటనే స్పందించి అన్ని స్టేషన్‌లకు సమాచారమందించడంతో నెల్లూరు, ప్రకాశం జిల్లాల పోలీసులు అప్రమత్తమయ్యారు. ప్రకాశం జిల్లా కనిగిరి వద్ద ఈ నలుగురు నిందితులను, సంఘటన జరిగిన కొన్ని గంటల్లోపే అదుపులోకి తీసుకున్నారు.

## కాలధర్మం

### తిక్కవరపు రాజగోపాలరెడ్డి



ప్రముఖ కాంట్రాక్టర్ మరియు బిల్డర్ నెల్లూరుజిల్లా వాసి తిక్కవరపు రాజగోపాలరెడ్డి మే7వ తేదీ గురువారం సాయంత్రం హైదరాబాదులో పరమపదించారు. ఆయన వయస్సు 80సంవత్సరాలు. రాజ్యసభ సభ్యుడు, కళా, సాహిత్య రంగాలతో పాటు రాజకీయరంగంలో ధృవతారలా వెలుగుతున్న తిక్కవరపు సుబ్బరామిరెడ్డికి రాజగోపాలరెడ్డి అన్న. వీరి మరో సోదరుడు తిక్కవరపు చంద్రశేఖరరెడ్డి దెక్కన్‌క్రానికల్ పత్రిక వ్యవస్థాపకుడిగా సంచలనాలకు సారధిగా నిలిచాడు. చాలా యేళ్ళ క్రితమే చంద్రశేఖరరెడ్డి దివంగతులయ్యారు.

రాజగోపాలరెడ్డికి భార్య రాజేశ్వరమ్మ, కుమారుడు ఉత్తమ్‌రెడ్డి, కుమార్తె ఉమారెడ్డి వున్నారు. కొంతకాలం అనారోగ్యంతో వుండి మే 7న ఆయన తుదిశ్వాస విడిచారు. మే8వ తేదీ శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లోని పంజాగుట్ట శ్మశానవాటికలో ఆయన అంత్యక్రియలు జరిగాయి. తిక్కవరపు, గునుపాటి కుటుంబసభ్యులతో పాటు అనేక మంది రాజగోపాలరెడ్డి కుటుంబసభ్యులు, మిత్రులు, ఆప్తులు ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నారు. 'లాయర్' పత్రిక వ్యవస్థాపకులు, కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డికి కూడా తిక్కవరపు రాజగోపాలరెడ్డి మంచి మిత్రుడు. తిక్కవరపు కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.


### మాగుంట శ్యామలమ్మ



ఒకప్పుడు నెల్లూరు కళ్యాణి ఫిలిమ్స్ కార్యాలయంలో మాగుంట సుబ్బరామరెడ్డి, పి.వి.ప్రసన్నరెడ్డిలను తెలియని వారు ఎలా వుండరో వెంకటనారాయణరెడ్డిని కూడా తెలియనివారుండరు. సుబ్బరామన్న అనుంగశిష్యుడిగా జిల్లా పోలీసుశాఖకు సంబంధించి ఎవరొచ్చినా వారి సమస్యలను తీర్చడంలో ముందుండేవాడు మాగుంట వెంకటనారాయణరెడ్డి.

ప్రస్తుతం కాంట్రాక్టర్‌గా స్థిరపడిన వెంకటనారాయణరెడ్డి మాతృమూర్తి శ్రీమతి శ్యామలమ్మ(లేట్ మాగుంట గోవిందరెడ్డి సతీమణి) మే 11వ తేదీ మంగళవారం రాత్రి తన 78వ యేట కన్నుమూశారు. గత కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో వున్నారు. ఆమెకు ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తెలు కాగా వెంకటనారాయణరెడ్డి ఆమె పెద్దకుమారుడు.

మంగళవారం ఆమె అంత్యక్రియలు వెంకటనారాయణరెడ్డి స్వగ్రామం చిన్నచెరుకూరులో జరిగాయి. వెంకటనారాయణరెడ్డి కుటుంబసభ్యులతో పాటు ఆయన మిత్రులు, ఆప్తులు అధికసంఖ్యలో శ్యామలమ్మ అంతిమయాత్రలో పాల్గొన్నారు. వెంకటనారాయణరెడ్డి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.



## 'ప్రభా'తం

# రేపటి ప్రజాతీర్పుకు వరం



ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నుంచి తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత ఎట్టకేలకు నిర్దోషిగా బయటపడ్డారు. కాలం కలసి రానప్పుడు పదవిని వదులుకోవడం.. అదృష్టం వరించినప్పుడల్లా తిరిగి ముఖ్య మంత్రి పీఠం అధిష్టిస్తూనే వుండడం ఆమెకు కొత్తేమీ కాదు. రాజకీయంగా ఎన్నో ఒడిదుడుకులను, కష్టనష్టాలనూ ఆమె చవిచూశారు. అయినా, ఎన్ని కష్టాలొచ్చినా తొణకకుండా బెణకకుండా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగడం ఆమె నైజం. అదే ఆమెను మళ్లీ నిలబెట్టింది. తమిళనాట తిరుగులేని నాయకిగా ఆమె తన ప్రాభవాన్ని మళ్లీ నిలబెట్టుకుంటోంది.

ఎట్టకేలకు తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత నిర్దోషిగా బయటపడ్డారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో కర్ణాటక హైకోర్టు తాజాగా వెలువరించిన తీర్పుతో ఆమెపై వున్న ఆరోపణలు కొట్టివేస్తూ, విచారణ కోర్టు విధించిన శిక్షలను రద్దు చేయడంతో ఆమెకు విముక్తి లభించినట్లయింది. నిర్దేశిత పరిమితి లోపే ఆస్తులున్నాయని కోర్టు స్పష్టం చేసింది. దీంతో, జయలలితతో పాటు, ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న శశికళ, ఇళవరసి, సుధాకరన్‌లను కూడా న్యాయస్థానం నిర్దోషులుగా ప్రకటించింది. ఈ తీర్పు తమిళనాడులోనే కాక, దేశవ్యాప్తంగా సంచలనం కలిగించింది. దాదాపు 19 ఏళ్ళుగా కొనసాగుతున్న ఈ కేసు ఇలా ఒక కొలిక్కి వచ్చినట్లయింది. 'నా రాజకీయ శత్రువులు నాపై ఈ కేసు మోపారు. నేనెలాంటి తప్పు చేయలేదని రుజువైంది. హైకోర్టు తీర్పు అత్యంత సంతృప్తి కలిగించింది. నా మీద వున్న మచ్చను తొలిగించింది. తమిళ ప్రజానీకం చేసిన ప్రార్ధనలకు ఇది దేవుడిచ్చిన వరం'.. అని జయలలిత తాజా కోర్టు తీర్పు పట్ల సంతోషం వ్యక్తం చేశారు కూడా. జయలలిత ఈ కేసు నుంచి నిర్దోషిగా బయటపడడం, భవిష్యత్తు రాజకీయాల్లో ఆమెకు బాగా కలిసివచ్చే అంశమైంది. తమిళనాడులో రాజకీయాల్లో మళ్ళీ మెరుపులు మెరుస్తున్నాయి.. క్షణక్షణం రాజకీయాలు శరవేగంగా రకరకాల మలుపులు తిరుగుతున్నాయి. తమిళనాడు అంతటా మళ్ళీ జయ పేరు మారుమ్రోగుతోంది. ఎక్కడ చూసినా జయలలిత అభిమానుల సంబరాలు మిన్నంటుతున్నాయి. ఇన్నాళ్లు ఎంతో క్లిష్టమైన కేసులో ఇరుక్కొని, ముఖ్యమంత్రి పదవిని కోల్పోయి, రాజకీయజీవితానికి కూడా తెరపడిన నేపథ్యంలో, ఇప్పుడు జయలలిత నిర్దోషిగా బయటపడడంతో తమిళనాడులో ఇంతకాలం స్తబ్ధుగా వున్న రాజకీయాలు జోరుగా ఊపందుకుంటున్నాయి. ఆమె మళ్ళీ తమిళనాడు ముఖ్యమంత్రిగా పదవిని అధిష్టించేందుకు మార్గం సుగమమైంది. రేపో, మాపో ఆమె ఆ మేరకు పదవీ ప్రమాణ స్వీకారం చేస్తారన్న ఊహాగానాలూ వినిపిస్తున్నాయి. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సమరానికి మరో ఏడాది మాత్రమే వ్యవధి వున్న ప్రస్తుత కీలక తరుణంలో ఈ తీర్పు వెలువడడం అన్నివిధాలా అన్నా డిఎంకెకి ఎంతో మేలు చేకూరుతుందనే సర్వత్రా భావిస్తున్నారు. తమ అధినాయకురాలైన జయలలితను కోర్టు నిర్దోషిగా ప్రకటించడంతో, అభిమానులకు, అన్నా డిఎంకె పార్టీ కార్యకర్తలు, నాయకుల ఆనందానికి అవధులే లేవు. కార్యకర్తలంతా జయలలితను అమ్మగా భావిస్తుంటారు. జయలలిత అంటే వారికి ఎనలేని అభిమానం. ఇన్నాళ్లు పడిన బాధలన్నీ ఇక సమసిపోయినట్లే.. ఇక అమ్మ కష్టాలన్నీ తీరిపోయినట్లే అని వారంతా ఎంతో ఆనందంగా సంబరాలు చేసుకుంటున్నారు. తీర్పు వెలువడిన అనంతరం, ప్రస్తుతం ముఖ్యమంత్రిగా వున్న పన్నీర్ సెల్వంతో పాటు, పార్టీ నేతలందరూ కలసి జయలలిత నివాసానికి వెళ్ళి ఆమెకు అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రిగా జయలలిత ఎప్పుడు ప్రమాణ స్వీకారం చేయాలని వారంతా సమావేశమై మల్లగుల్లాలు పడుతున్నారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నుంచి నిర్దోషిగా బయటపడిన జయలలితకు ప్రధాని మోడీ స్వయంగా ఫోన్ చేసి అభినందనలు చెప్పారు. దేశవ్యాప్తంగా ఎందరో నాయకులు ఆమెను అభినందిస్తున్నారు కూడా. ఇప్పుడే కాదు, గతంలోనూ జయలలిత ఎన్నో కేసులను ఎదుర్కొన్నారు. అన్నింటా నిలచి గెలిచారు. రాజకీయరంగంలో విలక్షణమైన శైలితో రాణించారు. ఓడినా, గెలిచినా..చివరికి పైచేయి తనదే అనిపించుకున్నారు. కాలం కలసిరానప్పుడు పదవిని వదులుకున్నారు.. అదృష్టం వరించినప్పుడల్లా ఆమె తిరిగి ముఖ్యమంత్రి పీఠం అధిష్టిస్తూనే వున్నారు. ఆమెకు ఇలాంటివేమీ కొత్త కాదు. రాజకీయంగా ఆమె ఎన్నో ఒడిదుడుకులను, కష్టనష్టాలనూ ఎదుర్కొన్నారు. అయినా, ఎంతో గుండెనిబ్బరంతో, ఆత్మస్థైర్యంతో ఆమె తన రాజకీయపయనం సాగిస్తూనే వున్నారు. ఎప్పటికప్పుడు తన పనితీరును మార్చుకుంటూ, ప్రజలకు అవసరమైన పథకాలను అమలు చేస్తూ, ఆమె ప్రజల మనసులను గెలుచుకుంటూనే వున్నారు. ఎంతటి క్లిష్టతరమైన పరిస్థితి వచ్చినా తొణకకుండా బెణకకుండా నిబ్బరంతో నిలబడి పోరాటం చేయడం ఆమె నైజం. అదే ఇప్పుడూ ఆమెను మళ్ళీ నిలబెట్టింది. ఆ ఆత్మవిశ్వాసమే ఆమెను మళ్లీ ప్రజల్లో తిరుగులేని నాయకిగా పల్లకీ ఎక్కించింది. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 39 స్థానాల్లో 37 స్థానాలను అన్నాడిఎంకె గెలుచుకోవడం తమిళనాడులో జయ లలితకు తిరుగులేని ప్రజాదరణకు నిదర్శనం కాక మరేమిటీ?.. తాజా తీర్పుతో మరింత ఉత్సాహంతో ఆమె రాజకీయాల్లో రాణిస్తారని వేరే చెప్పనక్కర లేదు. రాబోయే ఎన్నికల్లోనూ మరింత ఆధిక్యత సాధించి తమిళనాట అన్నాడిఎంకె జయపతాకాన్ని దిగ్విజయంగా ఎగురవేస్తారనడంలో ఎలాంటి సంశయం లేదు. ఇదిలావుంటే, జయలలిత ప్రత్యర్ధి, డిఎంకె అధినేత కరుణానిధికి ఈ తీర్పు శరాఘాతమైంది. తానొకటి తలిస్తే, దైవమొకటి తలచిందన్నట్లుగా ఈ ఏడాదే శాసనసభకు ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో, ప్రధాన ప్రత్యర్ధి అయిన జయలలిత ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఇరుక్కొని జైలులో వుంటుందని, ఇక మనకు తిరుగే లేదని భావించిన డిఎంకెవారి ఆలోచనలకు భిన్నంగా, ఊహించని విధంగా ఈ తీర్పు వెలుడడంతో డిఎంకె అవాక్కయింది. అనుకున్నది జరక్కపోవడంతో ఆ పార్టీ దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. అందులోనూ, ఈ ఏడాది చివరిలో వెలువడుతుందని భావిస్తున్న టూజీ తీర్పులో రాజా, కనిమొళి పరిస్థితి ఏమవుతుందోనన్న ఆందోళనా డిఎంకెలో లేకపోలేదు. ఈ పరిస్థితులన్నిటి దృష్ట్యా రానున్న రోజుల్లో డిఎంకెకి గడ్డుకాలమే ఎదురయ్యేట్లుగా కనిపిస్తోందని రాజకీయవర్గాలు ఊహిస్తున్నాయి. ఏదేమైనా, జయకు జయం కలిగినట్లే. తమిళనాడులో ఇప్పుడు 'జయ' జయధ్వానాలు మారుమ్రోగుతున్నాయి. అక్కడ ఇప్పుడు మళ్ళీ తిరిగి 'జయ'నామ సంవత్సరం వచ్చినట్లుగానే వుంది మరి!...

# సాటి మనుషులకు సహాయపడాలి




సప్తసూత్రాల్లో మొదటిదైన మానవత్వంతో మనుషులు సాటి మనుషులకు సహాయ పడాలని నెల్లూరుజిల్లా అడిషనల్ జాయింట్ కలెక్టర్ రాజ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ నెల 8వ తేదీన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా మేనేజర్ యం.వి.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి వారు నిర్వహిస్తున్న బ్లడ్‌బ్యాంక్, స్పాస్టిక్ సెంటర్, క్యాన్సర్ హాస్పిటల్, గాంధీ ఆశ్రమం కార్యక్రమాలకు అందరూ తమవంతు సహాయాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఎంహెచ్‌ఓ సి.వి.రమాదేవి, ప్రముఖ సామాజిక కార్యకర్త టి.సుకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బెల్ట్ షాపులపై కఠిన చర్యలు

మద్యం బెల్టుషాపులపై కఠిన చర్యలు తీసుకుంటామని, బెల్టు షాపులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్షైజ్ సూపరింటెండెంట్ డా. కె.శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ నెల 9న ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గత ఏడాది నుంచి ఇప్పటిదాకా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న షాప్‌లకు సంబంధించి 443 కేసులు నమోదు చేశామని, 403 మందిని అరెస్ట్ చేసి, నిందితులపై చర్యలు తీసుకున్నామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న మద్యం బెల్టు దుకాణాలపై కేసులు నమోదు చేస్తున్నామని ఆయన వివరించారు. ఏ ప్రాంతంలో బెల్టుషాపు వుందని తెలిస్తే, ఆ ప్రాంత అధికారి అందుకు నైతిక బాధ్యత వహించాల్సి వస్తుందని, ఆ మేరకు సంబంధిత అధికారికి ఛార్జిమెమో ఇస్తామని అన్నారు. ప్రజలు ఇలాంటి బెల్టుషాపుల వివరాలను తమకు తెలియజేస్తే, ఆయా ప్రాంతాల్లో తనిఖీ చేసి తగు చర్యలు తీసుకుంటామన్నారు. కోవూరులో బెల్టు దుకాణాలు లేకుండా చూడాలని ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి కోరివున్నారని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏడు ప్రత్యేక బృందాలను నియమించి, కోవూరు, కొడవలూరు, విడవలూరు, బుచ్చిరెడ్డి పాళెం మండలాల్లో ఇటీవల రెండురోజుల పాటు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా, నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నవారిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని, పలు దుకాణాలపై కేసులు నమోదు చేశామని ఆయన వివరించారు.

# చిరస్మరణీయులు.. నేదురుమల్లి

మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమైనవని, పెద్దాయనగా పేరుగాంచిన నేదురుమల్లి జిల్లా రాజకీయాల్లో తిరుగులేని నేతగా రాణించారని, రాష్ట్ర వ్యాప్తంగా ఎందరో నాయకులకు రాజకీయభిక్ష పెట్టిన మహానేత నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి అనీ వక్తలు ప్రశంసించారు. నేదురుమల్లి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఈ నెల 9న వాకాడులో జరిగిన కార్యక్రమంలో నేదురుమల్లి తనయులు, కుటుంబసభ్యులు, అభిమానులు నేదురుమల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వాకాడు సొసైటీ ఛైర్మెన్ కొడవలూరు దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ పెద్దాయన అభిమానాన్ని తాము మరచిపోలేమని అన్నారు. రాష్ట్రానికి ఆయన చేసిన సేవలు ఎన్నటికీ మరువలేనివన్నారు. తొలుత, నేదురుమల్లి తనయులు రామ్‌కుమార్‌రెడ్డి, గౌతమ్‌రెడ్డి, సోదరుడు హిమకుమార్‌రెడ్డి, బావ మరిది మేడా వెంకురెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం గౌతమ్‌రెడ్డి ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు దువ్వూరు భార్గవరామ్, విన్నమాల ద్వారకానాథ్‌రెడ్డి, వెంకట కృష్ణయ్య, సొసైటీ అధ్యక్షుడు ఏనుగు సుధాకర్‌నాయుడు, బందిలి వెంకటయ్య, మాజీ ఎంపిపిలు మధుసూదన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రమణమ్మ, ప్రజలు పాల్గొని నేదురుమల్లి సేవలను ప్రస్తుతిస్తూ ఆయనకు నివాళులర్పించారు.




## ఎమ్మెల్యే కోటంరెడ్డికి వినతి

నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సార్‌కి లాయర్ పత్రిక ప్రజావాణి ద్వారా మా సమస్యను తెలుపుకుంటున్నాము. నెల్లూరు టౌన్, రూరల్ ప్రాంతాల్లో వుండే టెన్త్, ఇంటర్, డిగ్రీ చదువుతున్న పెరిక కులస్థులైన విద్యార్థులకు కుల సర్టిఫికేట్‌లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు. చిత్తూరు, ప్రకాశం జిల్లాల్లో పెరిక బలిజలకు సర్టిఫికేట్లు ఇస్తున్నారు. గౌరవ ఎమ్మెల్యే గారు మా సమస్యపై కలెక్టర్, ఆర్డీఓలతో మాట్లాడి సర్టిఫికెట్లు ఇప్పించాలి. ఈ సమస్యపై అసెంబ్లీలో కూడా ప్రశ్నించాలని మనవి.

**– చింతల గోవర్ధన్, ఆమంచర్ల.**

## మిగతా ఎమ్మెల్యేలు నేర్చుకోవాలి

నరసింహకొండ బ్రహ్మోత్సవాలు జరిగేచోట తన ఫోటో వున్న ఫ్లెక్సీలు తొలగించి ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. ఆ ఫ్లెక్సీల ఖర్చుతో తిరునాళ్లకు వచ్చే భక్తులకు అన్నదానం చేయొచ్చు. బ్రహ్మోత్సవాలలో ఫ్లెక్సీలను ఆయనే స్వయంగా తొలగించడం అభినందనీయం. మిగతా ప్రజాప్రతినిధులు కూడా ఆయనను ఆదర్శంగా తీసుకోవాలి. ఎమ్మెల్యేలు తిరునాళ్లప్పుడు ఫ్లెక్సీలు కట్టించుకోవడం మీద పెట్టే శ్రద్ధ భక్తుల వసతుల మీద పెడితే బాగుంటుంది. ఓ మంచి ఒరవడికి శ్రీకారం చుట్టిన కోటంరెడ్డి అభినందనీయుడు.

**టి.క్రాంతి, నెల్లూరు.**

## రాజకీయస్వామ్యం

తెలుగుదేశం రాజకీయానికి కొత్త నిర్వచనం ఇచ్చిందట! రాజకీయ జోక్యం లేనిదే పాలన సాగదట! ఇదెక్కడి చోద్యం! 'వేలుపెట్టు వెంకటమ్మ' అన్నట్లు పాలనలో రాజకీయ జోక్యం ఉంటే ఉద్యోగస్థులు 'మూకుమ్మడి లాంగ్‌లీవ్'లో వెళ్లే ప్రమాదముంది.

**కురుగూరు రంగనాథం, నెల్లూరు.**

## సెలవులు ఇవ్వండి

నెల్లూరుజిల్లాలోని న్యాయస్థానాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు కూడా శాశ్వత ఉద్యోగులతో పాటు వేసవి సెలవులు ఇవ్వాలి. జిల్లా జడ్జి కనకదుర్గారావు ఈ విషయంపై చొరవచూపాలి. కంట్రాక్ట్ సిబ్బంది కూడా శాశ్వత ఉద్యోగుల కంటే ఎక్కువ కష్టపడుతున్నారని మనవి.

**కవిత.టి, వెంకటగిరి.**

# శ్రద్ధాంజలి



## తిక్కవరపు రాజగోపాలరెడ్డి గారు

(06.07.1935 - 07.05.2015)

అసతోమా సద్గమయ, తమసోమా జ్యోతిర్ గమయా
మృత్యోర్మామృతం గమయా, ఓం శాంతి శాంతి శాంతిః

: దివ్య స్మృతిలో :

**తిక్కవరపు రాజేశ్వరిరెడ్డి**

**తిక్కవరపు ఉత్తమ్ & లతా రెడ్డి**
**తిక్కవరపు దీపిక రెడ్డి**
**తిక్కవరపు ఆదిత్య రెడ్డి**

**గునుపాటి శ్రీధర్ & ఉమా రెడ్డి**
**గునుపాటి విష్ణు & మౌలిక రెడ్డి**
**సౌమ్య & శ్రీనాథ్ కొట్టం**

**మరియు కుటుంబసభ్యులు**

**ఉత్తరక్రియలు: తే.16.05.2015ది శనివారం మధ్యాహ్నం 12.30గంటలకు హైదరాబాద్‌లోని హోటల్ పార్క్ హయత్, బంజారాహిల్స్ నందు జరుగును.**

# నెల్లూరు కబుర్లు

## చంద్రబాబు రాక

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 20వ తేదీన జిల్లా పర్యటనకు రానున్నారు. ఆరోజు జిల్లాలో ఎక్కడో ఒక చోట ఏర్పాటు చేసే నీరు-చెట్టు కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. గత నెలలోనే ఆయన తూపిలిపాలెం వద్ద సునామీ కేంద్రం శంకుస్థాపనకు రావడం జరిగింది. విభజన తర్వాత రాష్ట్రంలో 13జిల్లాలే మిగలడంతో ప్రతిజిల్లాకు పర్యటనలు చాలా సులభమయ్యాయి.

## మేయర్ పుట్టినరోజు వేడుకలు

నెల్లూరు నగర మేయర్ అబ్దుల్ అజీజ్ జన్మదిన వేడుకలను 11వ తేదీ నెల్లూరులో ఘనంగా నిర్వహించారు. ముఖ్యంగా నగరపాలక సంస్థ కార్యాలయంలో ఫ్లెక్సీ కటౌట్‌లు పెట్టి, బాణాసంచా కాల్చి మరీ వేడుకలు జరుపుకున్నారు. పెద్దఎత్తున బుడగలు ఏర్పాటుచేసి అజీజ్ చేత ఎగురవేయించారు. బారాషహీద్ దర్గాలో ప్రార్థనలు చేసారు. హరనాథపురంలోని అజీజ్ ట్రస్ట్ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. గతంలో ఏ మేయర్, మున్సిపల్ ఛైర్‌పర్సన్‌లకు జరగనంత ఘనంగా అజీజ్ బర్త్‌డే వేడుకలు జరపడం విశేషం.

## జేసిఐ రక్తదానం



ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని నెల్లూరు మద్రాసుబస్టాండ్ వద్దగల ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో ఈ నెల 8వ తేదీన జేసిఐ, నెల్లూరుటౌన్ సంస్థ అధ్యక్ష కార్యదర్శులు సతీష్‌కుమార్, చరణ్‌కుమార్‌లు తొలుత రక్తదానం చేసి శిబిరాన్ని ప్రారంభించారు. జేసిఐ సభ్యులు, అభిమానులు, మిత్రులు రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్, సునీల్‌కుమార్, జూనియర్ జేసీ ఛైర్‌పర్సన్ నితేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ ఆపద్భాంధవ సక్సెస్



ఎంసెట్ వ్రాసే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పరీక్షలు వ్రాసేందుకు ఏపి పోలీసు అధికారులు, సిబ్బంది నిర్వహించిన 'ఆపరేషన్ ఆపద్భాంధవ" సక్సెస్ అయ్యిందని ఏపి పోలీసు అధికారుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు శ్రీహరిబాబు తెలిపారు. ఎంసెట్ పరీక్షపై ప్రభుత్వాధికారులు ఓ వైపు అవసరమైన చర్యలు తీసుకోగా, మరోవైపు పోలీసులు ఆపరేషన్ ఆపద్భాంధవను నిర్వహించి, పోలీసు అధికారులు, సిబ్బంది తమ వాహనాల్లో విద్యార్థులను పరీక్షా కేంద్రాలకు తీసుకొచ్చి పరీక్షలు వ్రాయించారని తెలిపారు.

## మహిళా వాకర్స్ మాతృదినోత్సవం



నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో ఆదివారం స్టేడియం మహిళా వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాతృదినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరు డిస్ట్రిక్ట్ వాకర్స్ అసోసియేషన్ మాజీగవర్నర్ ఎం.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ మహిళా వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాతృ దినోత్సవాన్ని నిర్వహించడం హర్షణీయమన్నారు. ప్రభుత్వ మెటర్నిటీ హాస్పిటల్ రిటైర్డ్ సూపరింటెండెంట్ డాక్టర్ సీతాలక్ష్మిని సన్మానించారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు భారతి, ప్రధాన కార్యదర్శి ఆదిలక్ష్మి, కోశాధికారి సావిత్రిరెడ్డి, ఏసి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి బాసం శేషగిరిరావు, సభ్యులు డాక్టర్ అంకిరెడ్డి, శేషగిరిరావు, మైథిలి మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విశ్వసాయి విద్యార్థినులకు అభినందనలు





నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని విశ్వసాయి కాలేజీ విద్యార్థినులు ఏ.శ్రీకావ్య, ఏఎస్‌ఏ నివాళికలు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఉత్తమ విద్యార్థులకు ఇచ్చే ఉపకారవేతనం, మెరిట్ అవార్డును కైవసం చేసుకున్నారని సంస్థ ఛైర్మన్ డా॥ ఎన్.సత్యనారాయణ, డైరెక్టర్ కృష్ణమోహన్‌లు తెలిపారు. ప్రభుత్వం నగదు బహుమతిని చెక్కురూపంలో అందజేసిందని, ప్రస్తుతం వీరు ఎంబిబిఎస్ రెండవ సంవత్సరం చదువుతున్నట్లు తెలిపారు. విద్యార్థినులను విశ్వసాయి కాలేజీ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

## ఎంసెట్ ముగిసింది



ఈ నెల 8వ తేదీన నెల్లూరులో ఎంసెట్ పరీక్షలను విజయవంతంగా నిర్వహించారు. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ఎంసెట్‌కు హాజరయ్యే విద్యార్థులు ఇబ్బంది పడకుండా అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసారు. పోలీసులు, స్వచ్ఛంధ సంస్థలు కూడా విద్యార్థులకు ఎంతగానో సహకరించారు. మొత్తం 14576మందికి గాను 13913మంది ఎంసెట్‌కు హాజరయ్యారు. ఇంజనీరింగ్‌లో 10840 మందికి గాను 10312మంది, మెడిసిన్‌లో 3736మందికి గాను 3601మంది పరీక్షకు హాజరయ్యారు. కలెక్టర్ ఎం.జానకి, ఎస్పీ గజారావుభూపాల్‌లు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు.



## సెయింట్ జోసెఫ్ పూర్వవిద్యార్థుల ఔదార్యం



నెల్లూరులోని సెయింట్ జోసెఫ్ 1980బ్యాచ్ పూర్వ విద్యార్థులు నగరంలోని పలువురు పేదలకు ఆర్థికసాయం అందించారు. కొడుకు కంటి ఆపరేషన్ కోసం ఎదురుచూస్తున్న కామేశ్వరి అనే మహిళకు 2వేల రూపాయలు, మరో షుగర్ పేషంట్‌కు 2వేల రూపాయలు, అలాగే మరికొంతమంది పేదలకు ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు ఎస్.సురేష్, టి.మునేంద్ర, సి.హెచ్.సత్యనారాయణ, సి.ఎల్.నారాయశ్రీ, యం.శ్రీధర్‌రెడ్డి, ఎన్.శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఈ నెల 4న వీరు వియానిహోంలో అనాథపిల్లలకు అల్పాహారం అందించారు.

## బాలు 'మదర్'కు సన్మానం



పినాకిని యూత్‌వెల్ఫేర్ అసోసియేషన్, రత్నమ్మ ఛారిటబుల్ సొసైటి సంయుక్తంగా మదర్స్‌డే సందర్భంగా ఆదివారం నెల్లూరు తిప్పరాజువారి వీధిలోని ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం నివాసంలో ఆయన తల్లి ఎస్పీ శకుంతలమ్మను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపకార్మిక కమిషనర్ రాచపాళెం రఘు, ఏపి కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు భవానీ నాగేంద్రప్రసాద్, కె.మురళీమోహన్‌రాజు, రచయిత కోలపల్లి ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంసెట్ విద్యార్థులకు చేయూత




ఈ నెల 8వ తేదీన జరిగిన ఎంసెట్ ఎంట్రన్స్‌ను పురస్కరించుకుని నెల్లూరులోని విఆర్ లా కాలేజీ సెంటర్ వద్ద విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు మాగుంట శరత్ చంద్రారెడ్డి యువజన సేవాసమితి ఆధ్వర్యంలో మజ్జిగ, మంచినీళ్లు, పులిహోర మరియు పెరుగన్న ప్యాకెట్లను ఉచితంగా అందజేశారు. ఎండలు మండిపోతుండడంతో ఆకలి దప్పులకు విద్యార్థులు, వారికి రక్షణగా వచ్చిన తల్లిదండ్రులు ఇబ్బంది పడకూడదనే మంచి ఉద్దేశ్యంతో మాగుంట శరత్‌చంద్రారెడ్డి యువజన సేవాసమితి సభ్యులు ఈ మంచి కార్యక్రమం నిర్వహించారు.

## థామస్‌కుక్ ట్రావెల్స్ ప్రారంభం

నెల్లూరు బృందావనంలో ఆదివారం థామస్‌కుక్ ట్రావెల్స్‌ను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1881 నుంచి ప్రపంచ వ్యాప్తంగా ఐదు కోట్లకు పైగా ట్రావెలర్స్‌కు సేవలు అందించిన థామస్‌కుక్ ట్రావెల్స్‌ను నెల్లూరులో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం నిర్వాహకులు రాఘవేంద్రషెట్టి, సురేష్‌షెట్టి, రమేష్‌బాబు, అవినాష్ మాట్లాడుతూ థామస్‌కుక్ ట్రావెల్స్‌కు ఎంతో పేరుందని, విదేశీ, స్వదేశీ టూర్లు, విదేశీ కరెన్సీ, వీసాలు, ట్రావెల్ ఇన్సూరెన్స్ సదుపాయాలు ఇక్కడ లభిస్తాయన్నారు.

## ఒత్తిళ్ల వల్లే అనారోగ్యం

### - జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్

ది నెల్లూరు జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటి లిమిటెడ్, కిమ్స్(బొల్లినేని హాస్పిటల్స్) సౌజన్యంతో ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మెగా ఉచిత వైద్యశిబిరాన్ని జిల్లా జాయింట్‌కలెక్టర్ ఇంతియాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యజీవితంలో ఎదురయ్యే ఒత్తిళ్ల వల్లే అనారోగ్యం కలుగుతుందన్నారు. జర్నలిస్టులు విధి నిర్వహణలో అనేక వత్తిళ్లు ఎదుర్కొంటూ అనారోగ్యానికి గురవుతున్న దృష్ట్యా ప్రభుత్వం ఈ విషయాన్ని గమనించి జర్నలిస్టులందరికి హెల్త్‌కార్డులు ఇస్తోందన్నారు. బొల్లినేని హాస్పిటల్స్ డైరెక్టర్ టి.గిరినాయుడు మాట్లాడుతూ తమ హాస్పిటల్ ఆధ్వర్యంలో విడతల వారీగా అన్ని విభాగాల వైద్యులచే వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి జర్నలిస్టులందరికీ పరీక్షలు చేయిస్తామన్నారు.

వైద్యశిబిరంలో ప్రముఖ గుండెవ్యాధి నిపుణులు డాక్టర్ సి.ఎస్.శ్రీనివాసరాజు, ఆర్థోపెడిక్ వైద్యులు పి.రామానాయుడు, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ పి.ఆర్.వంశీకృష్ణ తదితరులు జర్నలిస్టులు, వారి కుటుంబసభ్యులకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపియుడబ్ల్యుజే నాయకులు, హౌస్ బిల్డింగ్ సొసైటి సభ్యులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

## సోమయ్య వివాదం

జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఇ.డిగా సోమయ్యను నియమించడం వివాదాస్పదమైంది. పశు సంవర్ధకశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్ అయిన ఆయన 18ఏళ్ల నుండి డిప్యుటేషన్ల మీద కొట్టుకొస్తున్నాడు. 2011 ఆగష్టులో డిప్యుటేషన్‌పై పశు సంవర్ధకశాఖ నుండి జిల్లా షెడ్యూల్ కులాల సేవా సహకార సంఘం ఎగ్జిక్యుటివ్ డైరక్టర్‌గా వచ్చారు. 2014సెప్టెంబర్‌లో డిప్యుటేషన్‌లు రద్దు చేయడంతో సోమయ్య ఎస్సీ కార్పొరేషన్ బాధ్యతల నుండి తప్పుకుని సొంత శాఖకు వెళ్లారు. అయితే మళ్లీ రాజకీయ అండదండలతో ఆయన ఎస్సీ కార్పొరేషన్ ఇడిగా వేయించుకున్నారు. దీనిపై సంస్థ ఉద్యోగులే ఆందోళనకు దిగుతున్నారు.

# కాలువల పనులు త్వరగా పూర్తిచేయాలి

**- జిల్లా కలెక్టర్ ఎం.జానకి**



నీరు-చెట్టు కార్యక్రమంలో పాల్గొనే నిమిత్తం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వచ్చేవారంలో నెల్లూరు జిల్లాకు రానున్నారని జిల్లా కలెక్టర్ ఎం.జానకి పేర్కొన్నారు. మంగళవారం రాపూరు, వెంకటగిరి, గూడూరు మండలాల్లో తెలుగుగంగ ప్రాజెక్టుకు సంబంధించి నిర్మిస్తున్న కాలువలను కలెక్టర్ పరిశీలించారు. కాలువ నిర్మాణాలకు కావలసిన ఇసుకను దగ్గరలో వున్న ఇసుకరీచ్‌ల నుండి తెచ్చుకోవాలని ఇండెంట్ పంపాలని కోరారు. అటవీశాఖ అనుమతులు వచ్చినందున తెలుగుగంగ కాలువ నిర్మాణాల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. అనంతరం వెంకటగిరి పోలిశెట్టి పార్కు చెరువును వెంకటగిరి ఎమ్మెల్యే రామకృష్ణతో కలిసి పరిశీలించారు. అనంతరం ముక్కలపూడిలో తెలుగుగంగ ప్రాజెక్టు కాలువ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో నీరు-చెట్టు కార్యక్రమం క్రింద ఎక్కువ ఎకరాలకు సాగునీరందించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీరు సుధాకర్, డిఆర్‌డిఏ పిడి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# ఆటపాటలతో ఆరోగ్యం



నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో జిల్లా ప్రాధికారిక సంస్థ ఈ నెల 1 నుండి 31వ తేదీ వరకు క్రీడాకారులకు కోచ్‌లచే అందించే శిక్షణా తరగతుల్లో పాల్గొనే క్రీడాకారులకు ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఈ నెల 12వ తేదీన పౌష్టికాహారం పంపిణీ చేశారు. నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ క్రీడాకారులకు పౌష్టికాహారం అందజేయడం మంచి కార్యక్రమమని, ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ సభ్యులను అభినందిస్తూ క్రీడాకారులు ఈ సదవకాశాన్ని ఉపయోగించుకుని క్రీడల్లో రాణించి జిల్లాకు మంచి పేరుప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. పౌష్టికాహారం అందించిన దాతలు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.రంగారావు, రమేష్, షణ్ముగం, యన్ఎల్‌వి ప్రసాద్, కె.యం.రెడ్డిలను కోటంరెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపీ నగర అధ్యక్షులు తాటి వెంకటేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి, కార్పొరేషన్ విప్ బొబ్బల శ్రీనివాసయాదవ్, నలుబోలు బలరామయ్యనాయుడు, కార్పొరేటర్లు దొడ్డపనేని రాజానాయుడు, తిరుపతినాయుడు, ఏసి సుబ్బారెడ్డి అసోసియేషన్ అధ్యక్షులు డా॥ శ్రీనివాస కుమార్, కార్యదర్శి బి.శేషగిరిరావు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఎండలే కాదు...

# ధరలూ మండుతున్నాయి

### ఆకాశాన్నంటిన పప్పు, నూనెల ధరలు



ఇంట్లో ఏది వండాలన్నా పప్పులు, నూనె అవసరం. ప్రస్తుతం వాటి ధరలు చూసి సామాన్య మానవుడు బెంబేలెత్తుతున్నాడు. హోటల్‌కెళ్లి తినాలంటేనే బెదురుతున్న జనం తాజా ధరలు చూసి ఇంట్లో వంటలు వండుకునేందుకు కూడా భయపడుతున్నారు. నూనెల ధరలు చాలా కాలంగా కిందకు దిగి రాకపోగా, పెరగడంతో వినియోగదారుడికి దిక్కు తోచడం లేదు. వేరుశనగ, నువ్వులనూనె, పొద్దుతిరుగుడు కిలోకు రూ.10వంతున పెరిగాయి. సామాన్యులకు అందుబాటులో వుండే వనస్పతి, పామోలిన్, రైస్‌బ్రాన్ అయిల్ ధరలు ఎక్కువ ధర పలుకుతున్నాయి. కందిపప్పు, శనగపప్పు, మినపప్పు, పెసరపప్పు ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇవే కాకుండా మిగిలిన నిత్యావసర ధరలు కూడా అనూహ్యంగా పెరగడంతో ప్రజలు విలవిలలాడుతున్నారు. పప్పుల ధరలు పెరగడానికి అనేక రకాల కారణాలున్నాయి. దేశవ్యాప్తంగా పప్పుల నిల్వలు నిండుకోవడంతో ధరలు పెరిగిపోతున్నాయి. పప్పుల పంటలు కొన్ని రాష్ట్రాలకే పరిమితం కావడం, అక్కడ పండిన పప్పు అయిపోవడంతో తీవ్ర కొరత ఏర్పడింది. ప్రస్తుతం విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. నెల రోజుల నుంచి ఈ పరిస్థితి వుండటంతో ఒక్కసారిగా ధరలు అమాంతం పెరిగిపోయాయి. మిగతా జిల్లాల్లో కంటే ఇక్కడ కృత్రిమ కొరత సృష్టించడం ద్వారా మరింత పెంచుకోవచ్చన్న ఆలోచనలతో వ్యాపారులు ఉన్నారు. అందుకు అడ్డుకట్ట వేయకుంటే పప్పుల ధరలు మరింత పెరగడం ఖాయం. పప్పుల ధరల పెరుగుదలకు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తెలంగాణ, మన రాష్ట్రంలోని ప్రాంతాల్లో వర్షాభావంతో ఉత్పత్తులు తగ్గడమేనని భావిస్తున్నారు.

ఉన్న నిల్వలను ముందుగానే నల్ల బజారుకు తరలించడంతో పప్పుల లభ్యత తగ్గించి వ్యాపారులు ధరలు మరింత పెంచుతున్నారనే విమర్శలు వినవస్తున్నాయి. బ్లాక్ మార్కెట్‌లోని నిల్వలను బయటకు తీయాల్సిన అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో వ్యాపారుల ఆటలు సాగుతున్నాయనే ఆరోపణలున్నాయి. అధికారులు నామమాత్రపు దాడులతో సరిపెడుతుండడంతో వ్యాపారులు విచ్చలవిడిగా ధరలు పెంచుతున్నారు. ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి పప్పులను కొనుగోలు చేస్తున్న వ్యాపారులు భవిష్యత్తులో ధరలు మరింత పెరుగుతాయనే ఉద్దేశ్యంతో అక్రమంగా నిల్వ చేస్తున్నారు. అక్రమ నిల్వలను బయటకు తీయాల్సిన విజిలెన్స్, వాణిజ్య పన్నులు, తూనికలు కొలతలు శాఖాధికారులు జిల్లాలో ఏం చేస్తున్నారనేది అర్థం కాని ప్రశ్న. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పెరిగిన ధరలను నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



# పోలీసు కుటుంబ సభ్యులకు చేయూత

విధి నిర్వహణలో చనిపోయిన కానిస్టేబుళ్లు వెంకటేశ్వర్లు, ఖాజా రంతుల్లా కుటుంబసభ్యులకు ఒక్కొక్కరికి రెండు లక్షల రూపాయలు చొప్పున భద్రతా మొత్తాన్ని నెల్లూరుజిల్లా ఎస్పీ డా॥ గజరావు భూపాల్ అందజేశారని ఏపి పోలీసు ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మద్దిపాటి ప్రసాద్‌రావు తెలిపారు. నెల్లూరుజిల్లా చేజర్ల పోలీస్‌స్టేషనల్లో పనిచేస్తున్న కానిస్టేబుల్ సుధాకర్ పక్షవాతంతో బాధపడుతూ తాను డ్యూటి చేయలేనని తనకు మెడికల్ ఇన్‌వాలిటేషన్ క్రింద రిటైర్‌మెంట్ ఇప్పించి తన ఉద్యోగాన్ని తన కుమారునికి ఇచ్చి తన కుటుంబాన్ని ఆదుకోవాలని ఎస్పీని అభ్యర్థించగా అందుకు సానుకూలంగా స్పందించిన ఎస్పీ అన్ని విధాలుగా పోలీసు కుటుంబాలను ఆదుకుని వారి సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రెడ్డి గంగాధర్‌రావు, కార్యాలయ ఏఓ రాజశేఖర్, సూపరింటెండెంట్ సులోచన పాల్గొన్నారు.




ప్రాంతీయ వార్తల వేదికగా... స్థానిక సమాచార సూచికగా
నెల్లూరీయుల అభిమానాన్ని పొందిన
లాయర్ తెలుగు వారపత్రిక
కావలి పట్టణ శాఖ కార్యాలయాన్ని నెల్లూరు జిల్లా ఎస్పీ
డా॥ గజరావు భూపాల్ గారి చేతుల మీదుగా
ప్రారంభించుకున్న సందర్భంగా
అభినందన సుమాంజలి.
వీరిశెట్టి హాజరత్‌బాబు
ప్రొప్రైటర్
మురళీకృష్ణ పిక్‌నిక్ ఐస్‌క్రీమ్స్
మద్రాసు బస్టాండు దగ్గర, నెల్లూరు.
ఈ మండు వేసవిలో నెల్లూరీయుల కోసం సరికొత్త రుచులతో ఎన్నో వెరైటీ ఐస్‌క్రీమ్స్
॥ బ్లూబెర్రీ ॥ రసబెర్రీ ॥ ఫారెస్ట్ ఫ్రూట్ ॥ అంజీర్‌బాదమ్ ॥ అమెరికన్ డ్రైఫ్రూట్ ॥ క్యారమల్ నట్ ॥ నట్టీ డిలైట్ ॥ ఫ్రూట్ పంచ్ ॥ కాజు కిస్‌మిస్




అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినిబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# కళ్యాణ వైభవం...!




మాజీమంత్రి స్వర్గీయ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి మనుమడు, వైకాపా జిల్లా అధ్యక్షుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సోదరుడు రాజేంద్రకుమార్‌రెడ్డి - అన్నపూర్ణల కుమారుడు **రోహిన్ - ప్రియాంక**ల పరిణయం ఈ నెల 9వ తేదీ విశాఖలోని వాల్తేర్ క్లబ్‌లో జరిగింది. వారి పెళ్ళి రిసెప్షన్ ఈ నెల 13వ తేదీన నెల్లూరు విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగింది. కొత్త దంపతులకు 'లాయర్' అభినందనలు.



ట్రాన్స్‌కో రిటైర్డ్ ఏఇ అత్తిపల్లి పరంధామరెడ్డి - పరమేశ్వరిల కుమారుడు **వెంకురెడ్డి - సుప్రియ** (మర్రిపాడు మండలం, నందవరం గ్రామ వాస్తవ్యులు కంచి కృష్ణారెడ్డి - చంద్రమ్మల కుమార్తె)ల వివాహం ఈ నెల 6వ తేదీ నెల్లూరులోని శ్రీ రంగనాథస్వామి దేవస్థానం కల్యాణ మండపంలో జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాశీస్సులు.



తంజావూరు చిత్ర కళాకారుడు కీ॥శే॥ ఆరంబాకం రాజసింహ మనుమరాలు, ఎండోమెంట్స్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వేణుగోపాల్ - ఉషల కుమార్తె **కస్తూరి - మోహన్**(తిరువళ్లూరు జిల్లా బొమ్మిరాజు గ్రామం వాస్తవ్యులు వీర దయాళన్ - సావిత్రిల కుమారుడు)ల కల్యాణం ఈ నెల 3వ తేదీ నెల్లూరులోని అనిల్ గార్డెన్స్ నందు జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభదీవెనలు.



ఇందుకూరుపేట మండలం కుడితిపాలెం వాస్తవ్యులు మెట్టా శివకుమార్‌రెడ్డి -సునీతల కుమార్తె **సాయి సుధ - దివాకర్‌రెడ్డి** (నాయుడుపేట వాస్తవ్యులు పాలూరు రవికుమార్‌రెడ్డి - బుజ్జమ్మల కుమారుడు)ల పెళ్లి ఈ నెల 3వ తేదీ నెల్లూరులో ఎం.సి.యస్. కల్యాణ మండపం నందు జరిగింది. నూతన దంపతులకు 'లాయర్' శుభాకాంక్షలు.

# రోడ్డు మార్జిన్ వ్యాపారులకు స్థలాలు చూపాలి



గూడూరు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజా విజ్ఞప్తుల దినం పురస్కరించుకొని డివిజన్ పరిధిలో పలు గ్రామాలకు చెందిన రైతులు తమ సమస్యలను ఆర్డీవో రవీందర్‌కు మొరపెట్టుకున్నారు. ప్రధానంగా భూమి వివాదాల కారణంగా ఆయా గ్రామాల పరిధిలోని మండల రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా ఉందని ఆర్డీవోకు విన్నవించారు. పట్టణంలోని రోడ్డు మార్జిన్ వ్యాపారులకు స్థలాలు చూపాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పలువురు కలసి విన్నవించారు. చిల్లకూరు, చిట్టమూరు, వెంకటగిరి, బాలాయపల్లి, సైదాపురం తదితర ప్రాంతాలకు చెందిన అర్జీదారులు తమ సమస్యలను ఆర్డీవోకు తెలుపుకున్నారు. ఆర్డీవో 'లాయర్'తో మాట్లాడుతూ వచ్చిన సమస్యలను తక్షణం పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

### ఆర్టీసీ ప్రాంగణంలో
# సెక్యూరిటీ షెల్టర్‌ను ఢీకొట్టిన బస్సు




గూడూరు డిపో నుంచి వరగలికి వెళ్ళేందుకు ఆర్టీసీ బస్సును ఒప్పంద డ్రైవర్ నడుపుతూ ప్రమాదవశాత్తు సెక్యూరిటీ షెల్టర్‌ను ఢీకొన్న సంఘటనలో ముగ్గురికి గాయాలు కాగా త్రుటిలో డిపో మేనేజర్ మురళీకృష్ణ ప్రమాదం నుంచి బయటపడ్డారు. స్థానిక డిపో ప్రాంగణం నుంచి రోజువారీగా బస్సులను పంపే ప్రక్రియలో భాగంగా సోమవారం ఉదయం డిపో మేనేజర్, సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. ఈక్రమంలో గూడూరు నుంచి వరగలికి వెళ్లేందుకు ఒప్పంద కార్మికుడు అశోక్ డిపో ప్రాంగణం నుంచి వెలుపలకు తీసే క్రమంలో పక్కనే వున్న సెక్యూరిటీ షెల్టర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో షెల్టర్ కూలిపోవడంతో పక్కనేవున్న ఒప్పంద కార్మికులు శ్రీనివాసులు, శోభా, సెక్యూరిటీ సిబ్బంది గాయపడ్డారు. అదే సమయంలో పక్కనే వున్న డిపో మేనేజర్ మురళీకృష్ణ తృటిలో తప్పించుకొన్నారు. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను వెంటనే చికిత్స నిమిత్తం పట్టణంలోని ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. ప్రమాద సంఘటన తెలుసుకొన్న కార్మికులు పెద్దసంఖ్యలో నిరసన వ్యక్తం చేశారు.

# నేదురుమల్లికి నివాళులు

గూడూరు పట్టణంలో మాజీముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా గడియారపు స్థంభం వద్ద 9వ తేదీ కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రాంతీయ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పరిమళ వెంకటేశ్వర్లు, జిలాని, ప్రసాద్, ఉమాదేవి, కుమార్, సుధాకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# వేసవి క్రికెట్ శిక్షణ శిబిరం

గూడూరులోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో గూడూరు క్రికెట్ క్లబ్, హరిచంద్రారెడ్డి క్రికెట్ క్లబ్ సంయుక్తంగా వేసవి కాలపు క్రికెట్ శిక్షణా శిబిరాన్ని డిఎస్పీ బి.శ్రీనివాస్ 9వ తేదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి శెలవుల్లో విద్యార్థులు క్రికెట్‌లో శిక్షణ తీసుకోవడం ఎంతో మంచిదన్నారు. సెలవులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఇలాంటి శిక్షణకు ఇతర పట్టణాల్లో వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వుంటుందని, గూడూరులో ఉచితంగా అందిస్తున్నారన్నారు.

ఈ కార్యక్రమంలో వైస్‌ఛైర్మెన్ శీలం కిరణ్‌కుమార్, కె.మునిగిరీష్, ఎస్సై బాబి, సభ్యులు అనిల్, నాగేశ్వరరావు, సురేంద్రరెడ్డి, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు

గూడూరులోని కరుణాలవీధిలో వెలసివున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ చెన్నకేశవస్వామి దేవస్థానంలో జరుగుతున్న శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు 12రోజుల పాటు ఘనంగా జరిగాయి. భక్తులందరూ అధికసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఉభయదాతలుగా ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, శివకుమార్ రెడ్డి, పొనకా శ్రీనివాసులురెడ్డి, సునంద వ్యవహరించారు.



సోమవారం గూడూరు తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజా వినతుల దినంలో తహశీల్దార్ సి.వెంకటనారాయణమ్మకు అర్జీలు సమర్పిస్తున్న అర్జీదారులు

### విఆర్ఏల
# జీతాలు పెంచాలి

గ్రామస్థాయిలో భూమిశిస్తు, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో కీలకపాత్ర పోషిస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకులకు జీతాలు పెంచాలని ఆ సంఘ డివిజన్ అధ్యక్షుడు వి.రాధాకృష్ణయ్య ఒక ప్రకటనలో ఆదివారం కోరారు. కాంట్రాక్టు ఉద్యోగులకు సరైన జీతం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, 10వ పీఆర్సీ కమిటీ జీతాలు పెంచాలని సిఫార్సు చేసినా అమలు చేయకపోవడంతో ఉద్యోగులు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. విఆర్ఏలను రెగ్యులర్ చేసి ఫిట్‌మెంట్ ఇవ్వాలని కోరారు.

గల్పిక

# లోకేష్‌తో ఫోటో కోసం లక్ష డాలర్లిచ్చిన ఒబామా

కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న హైదరాబాద్ నగరం. ఆ నగరంలో ఆంధ్రా ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసం. ఇల్లంతా తెలుగుదేశంపార్టీ నాయకులతో సందడిగా వుంది. కేంద్రమంత్రులు అశోక్ గజపతిరాజు, సుజనాచౌదరి, రాష్ట్ర మంత్రులు కె.ఇ.కృష్ణమూర్తి, నిమ్మకాయల చినరాజప్ప, యనమల రామకృష్ణుడు, పి.నారాయణ, పరిటాల సునీత, బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, దేవినేని ఉమామహేశ్వరరావు, రావెళ్ల కిషోర్‌బాబు, పి.పుల్లారావు, పార్టీ నాయకులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పయ్యావుల కేశవ్, గాలి ముద్దుకృష్ణమనాయుడు, బీద రవిచంద్ర, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ వంటి వారంతా ఉన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు తేవడానికి తెలుగుదేశం భవిష్యత్ ఆశాకిరణం నారా లోకేష్ అమెరికా యాత్రకు బయలుదేరుతున్న సందర్భంగా వీళ్లంతా టాటా, బైబై చెప్పడానికొచ్చారు. లోకేష్ నాలుగు సూట్‌కేసుల నిండా లగేజీ సర్దుకుని లోపల నుంచి బయటకొచ్చాడు. మంత్రి పీతల సుజాత లోకేష్‌కు దిష్టి తీసింది. లోకేష్‌తో కె.ఇ.కృష్ణమూర్తి వుండి... బాబూ, మా ఆశలన్నీ నీ మీదే, కేంద్ర ప్రభుత్వం మనకు రూపాయి కూడా ఇవ్వడం లేదు, మా ఛాంబర్‌లో కరెంట్ బిల్లులు కట్టలేక ఏసిలు కూడా వేసుకోవడంలేదు. ఎండలకు మలమల మాడిపోతున్నాం. నీ టాలెంట్‌నంతా చూపించి అమెరికా నుండి ఎలాగైనా పెద్దఎత్తున పెట్టుబడులు తీసుకురావాలని కోరాడు. వెంటనే పి.నారాయణ అందుకుని... లోకేష్ ఎవరు? నా శిష్యుడు. తండ్రికి తగ్గ తనయుడిగా, గురువును ముంచిన... సారీ, గురువును మించిన శిష్యుడిగా నీవు అమెరికా పర్యటన విజయవంతం చేసి నిరూపించుకోవాలి బాబూ అని ఆకాంక్షించాడు. తర్వాత ఫ్లైట్‌కు టైం కావడంతో అందరూ కార్లలో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. లోకేష్‌బాబు విమానమెక్కాడు. విమానంలో వున్న పైలట్ క్రిందకు దిగాడు. ఏమైందని చంద్రబాబు అడిగాడు. ఇంజిన్ ఆన్ కావడంలేదు, ఎంత కిక్ కొట్టినా మొరాయిస్తుందని పైలట్ చెప్పాడు. వెంటనే సోమిరెడ్డి.. నువ్వెళ్లి సీట్లో కూర్చో... మేమందరం కలిసి బలంగా విమానాన్ని నెడతాం, ఆ ఊపులోనే ఇంజన్ స్టార్ట్ చెయ్... మా అల్లీపురంలో సడెన్‌గా బస్సులు ఆగిపోతే ఇలాగే చేస్తుంటామన్నాడు. వెంటనే బాలకృష్ణ... ఇంతమందికి శ్రమ ఎందుకు చెప్పండి... దీని సంగతేంటో నేను తేలుస్తాను అంటూ పైలట్‌ను కాక్‌పిట్‌లో కూర్చుని ఇంజన్ తాళంను ఆన్‌లోకి తిప్పి పట్టుకోమన్నాడు. పైలట్ కాక్‌పిట్‌లోకి వెళ్లి అలాగే చేసాడు. వెంటనే బాలయ్య కుడి మోకాలిని పైకి లేపి చేత్తో బలంగా తన తొడ మీద కొట్టాడు. ఆ తొడ దెబ్బసౌండ్‌కు విమానం ఇంజన్ ఆన్ అయ్యి సౌండెత్తుకుంది... క్షణాల్లో రన్‌వే మీద నుండి గాల్లోకి లేచింది. బాలయ్య ప్రయోగాన్ని చూసి ఎయిర్‌పోర్టు అధికారులు ఆశ్చర్యపోయారు. వాళ్లు బాలయ్య వద్దకొచ్చి... సార్, విమానాలు మొరాయించినప్పుడల్లా మీకు ఫోన్ చేస్తుంటాం, శ్రమ అనుకోకుండా కొంచెం ఇక్కడిదాకా వస్తుండండి సార్ అని చెప్పారు. జాలి హృదయుడైన బాలయ్య అందుకు సరేనన్నాడు. తర్వాత అక్కడ నుండి ఎవరి దారిన వాళ్లు వెళ్లిపోగా చంద్రబాబు ఇంటికి చేరుకున్నాడు. అప్పటికే అక్కడకు రవాణామంత్రి సిద్ధా రాఘవరావు వచ్చి ఉన్నాడు. చంద్రబాబు అతనిని చూసి... రాఘవరావు, ఆర్టీసీ సమ్మె పరిస్థితి ఏంటని అడిగాడు. కార్మికులు దిగి రావడం లేదు సార్, సంస్థ రోజురోజుకీ నష్టాల్లోకి పోతుందని రాఘవరావు చెప్పాడు. అప్పుడు చంద్రబాబు... రాఘవరావు, ఈ తలనొప్పంతా మనకు అవసరమా, ఋణమాఫీకి, రాజధాని బిల్డింగ్‌లకు చాలా డబ్బు కావాలి, రాష్ట్రంలో వున్న ఆర్టీసీ బస్సులన్నింటిని అమ్మేద్దాం, ఎంతోకొంత వస్తుంది. ఆర్టీసీ డిపోలు, బస్టాండ్‌లు వున్న స్థలాలను, ఇతర ఆస్తులను కూడా అమ్మేద్దాం, వేల కోట్లు వస్తాయి. అదీగాక నెలనెల ఇచ్చే కోట్ల రూపాయల జీతాలూ మిగులుతాయి. బస్సులు లేకపోయినంత మాత్రాన ప్రజల జీవిత చక్రమేమీ ఆగిపోదు. పదిరోజుల నుండి సమ్మె చేస్తున్నారు, ప్రజలేమన్నా ప్రయాణాలు మానుకున్నారా, పెళ్ళిళ్లు, ఇతర కార్యక్రమాలు ఏవన్నా ఆగాయా? ఏమంటావ్ అని ప్రశ్నించాడు. మంచి ఐడియా సార్, ఈ ఒక్క ఐడియా లక్షలాదిమంది కార్మికుల బ్రతుకులనే మార్చేస్తుందంటూ రాఘవరావు అక్కడ నుండి లేచాడు. తర్వాత చంద్రబాబు స్నానం చేసి తన శ్రీమతి భువనేశ్వరీదేవి ఆ పూట కోటా క్రింద పెట్టిన రెండు పుల్కాలు తిని తన బెడ్‌రూంలో తలమీద తడిగుడ్డ వేసుకుని కళ్లు మూసుకుని పడుకున్నాడు. క్షణాలలో నిద్రాదేవి ఆయనను ఆవహించేసింది.

★★★★★

వాషింగ్టన్ ఎయిర్‌పోర్టు... ప్రవాస ఆంధ్రులతో పాటు అమెరికా అధికారులు పూలబొకేలు పట్టుకుని నిలబడి వున్నారు. అప్పుడే లోకేష్ లగేజీని తోసుకుంటూ బయటకొచ్చాడు. అమెరికన్ అధికారులు, ప్రవాసాంధ్రులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. కొందరు అభిమానులు లోకేష్ ఆటోగ్రాఫ్ కోసం, షేక్‌హ్యాండ్ కోసం ప్రయత్నించారు. లోకేష్ వాటిని తిరస్కరిస్తూ ఇవన్నీ రేపు చూసుకుంటాం అని చెప్పాడు. తర్వాత లోకేష్ హోటల్‌కు వెళ్లాడు. అప్పటికే అక్కడ ఆంధ్రప్రదేశ్ ఉన్నతాధికారులు అభీష్ట, నాగేశ్వరరావులు ఉన్నారు. లోకేష్ వుండి వారితో... మనం మన రాష్ట్రంలో అభివృద్ధికి నిధుల కోసం ఇక్కడకు వచ్చాం. దానిని ఎలా ప్లాన్ చేసారని అడిగాడు. అభీష్ట అందుకు... సార్, మీతో షేక్‌హ్యాండివ్వాలంటే పదివేల డాలర్లు పెట్టాం, మీరు ఉపన్యసించే సమావేశంలో కూర్చోవాలంటే 5వేల డాలర్లు, మీతో పాటు మార్నింగ్ వాకింగ్‌కు 25వేల డాలర్లు, మీతో పాటు స్విమ్మింగ్ ఫూల్‌లో ఈత కొట్టడానికి 50వేల డాలర్లు పెట్టాం. మీతో కలిసి ఫోటో దిగాలంటే లక్ష డాలర్లుగా నిర్ణయించాం. స్విమ్మింగ్‌ఫూల్ ఈవెంట్‌కు వూహించని స్పందన వుందని చెప్పాడు. లోకేష్ వాటిని ఓకే చేశాడు. పక్కరోజు మార్నింగ్‌వాక్‌తో లోకేష్ నిధుల సేకరణ మొదలుపెట్టాడు. వాకింగ్ తర్వాత స్విమ్మింగ్‌కు యువతీయువకులు పెద్దఎత్తునే వచ్చారు. అమెరికాలో లోకేష్‌కు బాగా క్రేజ్ వుండడంతో ఆ దేశీయులు కూడా ఆయనతో కలిసి స్విమ్మింగ్ చేసేందుకు తెగ ఉత్సాహం చూపారు. స్విమ్మింగ్‌కు లిమిటెడ్ టిక్కెట్లే పెట్టడంతో కొందరైతే బ్లాక్‌లో టిక్కెట్లు కొని మరీ లోకేష్‌తో కలిసి స్విమ్ చేశారు. తర్వాత లోకేష్ సమావేశం జరిగింది. ఆపైన లంచ్ ఈవెంట్ కూడా ముగిసింది. వీటిద్వారా బాగానే డబ్బులొచ్చాయి. సాయంత్రం ఫోటో సెషన్ పెట్టుకున్నారు. లోకేష్‌తో ఫోటో కోసం పెట్టిన లక్షడాలర్ల టిక్కెట్లు హాట్‌కేకుల్లా అమ్ముడుపోయాయి. ఫోటో సెషన్ కోసం టోకెన్ నెంబర్ల ప్రకారం పేర్లు పిలవసాగాడు. జార్జిబుష్, బిల్ క్లింటన్, హిల్లరీ క్లింటన్, మోనికా లూయిన్‌స్కీ, రోజర్ బిన్నీ, కండోలిజారైస్... ఇలా అమెరికా అగ్రవ్యక్తులంతా వచ్చి లోకేష్‌తో ఫోటోలు దిగసాగారు. వీళ్లు పోటోలు తీసుకుంటున్నప్పుడల్లా ప్రవాసాంధ్రులు పెద్దఎత్తున చప్పట్లు కొడుతున్నారు. చివరగా అభీష్ట.. మిస్టర్ ఒబామా, మిసెస్ మిషెల్లీ ఒబామా అని పేర్లు పిలిచాడు. ఒబామా, మిషెల్లీ ఒబామాలు జనం మధ్యలో నుండి వచ్చి లోకేష్‌కు అటు ఇటు నిలుచున్నారు. అమెరికా అధ్యక్షుడే లక్ష డాలర్లు ఇచ్చి లోకేష్‌తో ఫోటో దిగుతుండడంతో ప్రవాసాంధ్రుల ఆనందానికి అంతులేకుండాపోయింది. మా లోకేష్ క్రేజ్ ఖండాంతరాలు దాటిపోయిందంటూ వాళ్లంతా దబ దబమని చప్పట్లు కొట్టసాగారు. ఈ ఆనందంలోనే తన గదిలో నిద్రలోవున్న చంద్రబాబు కూడా రెండు చేతులతో చప్పట్లు కొట్టసాగాడు. ఆ సౌండ్‌కు పక్కనే వున్న భువనేశ్వరి దేవి లేచి... చంద్రబాబును ఏమండీ, ఏమండీ... అంటూ గట్టిగా తట్టింది. చంద్రబాబు నిద్రలోనే... విసిగించమాకే, అవతల మన లోకేష్‌తో ఒబామా లక్ష డాలర్లు కట్టి మరీ ఫోటో దిగుతున్నాడు చూడూ... అంటూ మళ్లీ చప్పట్లు కొట్టసాగాడు. ఇక లాభం లేదనుకున్న భువనేశ్వరీదేవి... పక్కనే వున్న చెంబులోని నీళ్లు చేతిలోకి తీసుకుని చంద్రబాబు ముఖంపై చల్లింది. ఆ దెబ్బకు ఆయనకు నిద్రమత్తు వదిలి లేచి కూర్చున్నాడు. లోకేష్ అమెరికా సంఘటనపై అప్పటిదాకా తన కొచ్చిందంతా కల అని తెలుసుకోవడానికి చంద్రబాబుకు ముప్పావుగంట పట్టింది.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

వివాహ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. అనుకున్న పనులు నిదానంగా సాగుతూ విసుగు అనిపిస్తుంది. వృత్తివ్యాపారాలు ఆశించిన స్థాయిలో ఉండకపోవచ్చును. అప్పుడప్పుడు అదనపు ఖర్చులు పైనబడగలవు. ఆరోగ్య విషయంలో జాగ్రత్త తీసుకోవాలి. స్థిరాస్తుల సంపాదనపై ఆలోచనలు పెరుగుతాయి. కుటుంబ సౌఖ్యము బాగుంటుంది.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

మిత్రుల సహకారం బాగుంటుంది. కొత్త పదవులు, కొత్త బాధ్యతలు లభించే అవకాశం ఉన్నది. ఆదాయం కంటే ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. వృత్తి వ్యాపారాల వర్గాలకు అభివృద్ధి అవకాశాలు తగ్గగలవు. రాబడి తగ్గుతుంది. అనుకున్న పనులు సమర్ధవంతంగా జరుపుకొనగలరు. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. ముఖ్య పనులందు కొద్దిగా టెన్షన్ ఉంటుంది.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ధ, పునర్వసు 1, 2, 3పాదాలు

బంధుమిత్రులతో సత్సంబంధాలు బలపడతాయి. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. అల్లులతో తగాదాలు కలిగే అవకాశం ఉంది కాబట్టి జాగ్రత్తపడండి. ఖర్చులు పెరిగినా ఆదాయానికి లోపంరాదు. వృత్తి వ్యాపారాలు స్వల్ప ఇబ్బందులుండి అభివృద్ధి బాగుంటుంది. ఇతరులకు ధన వస్తు మాట రూపంలో సహాయపడతారు. ఉద్యోగులకు పనిభారం ఉండినా సమర్ధవంతంగా పనులు చేస్తారు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

చేపట్టిన పనులు నిదానంగా సవ్యంగా జరుగుతాయి. బంధుమిత్రులను కలుసుకొనడం, శుభకార్యాలలో పాల్గొనడం జరుగుతుంది. వృత్తి వ్యాపారాలలో ఆదాయం పెరుగుతుంది. రావలసిన బాకీలు ఆలస్యంగా అందుతాయి. వాణిజ్య, వ్యవహార ఒప్పందాలు జరిగే అవకాశం ఉన్నది. కొత్త వస్తువులు, యంత్రాలు కొనుగోలు చేస్తారు. ఉద్యోగులకు సమర్ధత గుర్తింపు గౌరవాలు బాగుంటాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి, ఆదాయం బాగుండినా కొన్ని అదనపు ఖర్చులు తప్పనిసరిగా ఉంటాయి. అవగాహన లేని విషయాలకు దూరంగా ఉండటం మంచిది. అనుకున్న పనులు నిదానంగా జరుగుతుంటాయి. శుభకార్య ప్రయత్నాలు ఫలించగలవు. బిడ్డల వల్ల కొద్ది సమస్యలు రావచ్చును. కొత్త వ్యాపారాలు చేయడానికి, పెట్టుబడులకు అనుకూల సమయం.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

బంధుమిత్రుల వల్ల ఇబ్బందులు పడగలరు. ఉద్యోగులకు బాధ్యతలు పెరిగినందువల్ల శ్రమ ఎక్కువుగా ఉంటుంది. పనులు సరిగా జరగక, కొన్ని ముఖ్య విషయాల్లో ఏం చేయాలో తోచక టెన్షన్ పడుతుంటారు. వ్యాపారవృద్ధి అవకాశాలు చేజారవచ్చు. ఆదాయం సామాన్యంగా ఉంటుంది. ఖర్చులు అన్ని విధాలా పెరుగుతాయి. రావలసిన బాకీలు నిలబడిపోతాయి.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 15.05.2015 నుండి
తేది. 21.05.2015 వరకు

ఈ వారం మీనంలో కేతువు, మీన మేష వృషభ మిధున రాశులలో చంద్రుడు, వృషభంలో రవికుజ బుధులు, మిధునంలో శుక్రుడు, కర్కాటకంలో గురువు, కన్యలో రాహువు, వృశ్చికంలో శని సంచరిస్తారు.

**పంచాంగము:**

కర్తరి జరుగుచున్నది.
గృహముల నిర్మాణముకు సంబంధించిన లగ్నములుండవు.

**ముహూర్తములు**

తేది 20 బుధవారము ఉదయం గంట 9.10 నుండి గంట 11.20లోగా కర్కాటక లగ్నమున వ్యాపార అన్నప్రాశన, అక్షరాభ్యాస, ఉపనయన, వివాహములకు ముహూర్తము.

**వైశాఖమాస కృష్ణపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 15 | శుక్ర | ద్వాదశి | సా॥ గం.3.32వ॥ |
| తేది. 16 | శని | త్రయోదశి | మ॥ గం.1.18వ॥ |
| తేది. 17 | ఆది | చతుర్దశి | మ॥గం.11.18వ॥ |
| తేది. 18 | సోమ | అమావాస్య | ఉ॥గం.9.35వ॥ |

**జ్యేష్ఠ మాస శుక్లపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 19 | మంగళ | పాడ్యమి | ఉ॥గం.8.15వ॥ |
| తేది. 20 | బుధ | విదియ | ఉ॥గం.7.20వ॥ |
| తేది. 21 | గురు | తదియ | ఉ॥గం.6.52వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

వేడుకలు, శుభకార్యాలు, దైవకార్యాలలో పాల్గొంటారు. ఉద్యోగులకు అదనపు బాధ్యతలుంటాయి. షేర్లు ఆశించిన విధంగా ఉండవు. గృహ వస్తు వాహన రిపేర్లుంటాయి. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి, మంచి అవకాశాలు దొరుకుతాయి. ఆదాయం పెరుగుతుంది. తొందరపాటుతో వ్యవహరించవద్దు. ఉద్యోగార్ధులకు అవకాశాలుంటాయి. ఆరోగ్యం బాగుంటుంది.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

కోర్టు వ్యవహారాలు వాయిదా పడగలవు. బాకీల వత్తిడులు పెరుగుతాయి. బంధుమిత్రులతో పేచీలు ఏర్పడవచ్చును. క్రొత్త పెట్టుబడులు, వ్యాపార భాగస్వామ్యాల ఆలోచనలు నిలబడిపోతాయి. వృత్తి వ్యాపారాలలో అవకాశాలు తగ్గుతాయి. ఆదాయ వ్యయాలకు పొంతన సరిగా ఉండదు. అదనపు ఖర్చులు తప్పనిసరి. ఆర్థిక లావాదేవీలందు జాగ్రత్త పడండి.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

కోర్టు కేసులందు అనుకూలత ఉంటుంది. బహుమతులు కానుకల ఖర్చులు పెరుగుతాయి. ముఖ్య వ్యవహారాలు, అనుకున్న పనులు సక్రమంగా జరుగుతాయి. వ్యాపారవర్గాలకు మంచి అవకాశాలు లభించి, ఆదాయం పెరుగుతుంది. రావలసిన బాకీలు కొంత అందుతాయి. కుటుంబంలో స్వల్ప విభేదాలుండి సర్దుకొంటాయి. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఉద్యోగార్ధులకు అనుకూల సమయం. ఉద్యోగులకు పని వత్తిడి, అధికారుల వల్ల సమస్యలుంటాయి. ఆర్థికాభివృద్ధి పథకాలు ఫలించి వృత్తి వ్యాపారాలు వృద్ధి చెందుతాయి. ఆదాయం పెరుగుతుంది. అనుకున్న పనులను ప్రణాళికాబద్ధంగా జరుపుకొంటారు. ఆరోగ్యం బాగానే ఉంటుంది. స్థిరాస్తులను సమకూర్చుకొనే దిశలో ముందుకు సాగుతారు. హామీలు ఇవ్వకండి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

వేడుకలు, శుభకార్యాలలో పాల్గొంటారు. చిన్న వ్యాపారులు, కుటీర పరిశ్రమల వారికి ఆర్థికంగా బాగుంటుంది. బంధువులు మిత్రులను కలుసుకొంటారు. బాగా శ్రమపడితే గాని పనులు జరగవు. కుటుంబంలో కొద్దిపాటి అశాంతి ఏర్పడుతుంది. వ్యాపారములలో వృత్తులలో అభివృద్ధి, పెట్టుబడి అవకాశాలు బాగుండి ఆదాయం పెరుగుతుంది. బిడ్డల వివాహ ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

వృత్తి వ్యాపారాలలో రాబడి పెరుగుతుంది. ఆర్థికావకాశాలు అందిపుచ్చుకుంటారు. సమావేశాలు, శుభకార్యాలలో పాల్గొంటారు. ఆత్మీయులకు సహాయ సహకారాలు అందిస్తారు. రావలసిన బాకీలు, కోర్టు కేసులు వాయిదా పడతాయి. ఆందోళనకరంగా ఉన్న సమస్యలు పరిష్కారం కాగలవు. షేర్లు లాభాలనందిస్తాయి. ఉద్యోగావకాశాలు లభించగలవు. విలువైన వస్తువులు కొంటారు.



# కావలి కబుర్లు

## ఎంసెట్ విద్యార్థుల సేవలో
# కావలి బ్రేక్ ఇన్స్పెక్టర్



ఈ నెల 8వ తేదీన జిల్లా కేంద్రమైన నెల్లూరులో జరిగిన ఎంసెట్ పరీక్ష వ్రాసిన విద్యార్థుల కోసం కావలి మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఏ.చంద్ర శేఖర్‌రెడ్డి ప్రత్యేక ఏర్పాట్లు చేయడం విశేషం. ఆరోజుకు ఆర్టీసీ సమ్మె జరుగుతోంది. మూడింతల బాడుగ ఇచ్చినా ప్రైవేట్ టాక్సీలు దొరకని పరిస్థితి. కావలి నుండి నెల్లూరుకు సమయానుకూలంగా రైళ్లు లేవు. ఈ పరిస్థితులను గమనించిన బ్రేక్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి కావలిలోని విశ్వోదయ, ఆర్ఎస్ఆర్, డిబిఎస్ ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యంతో మాట్లాడి కావలి నుండి నెల్లూరుకు 25బస్సులు ఏర్పాటు చేయించారు. నెల్లూరుకు రాను పోను ఈ బస్సులు బాగా ఉపయోగపడ్డాయి. విద్యార్థులకు మంచినీళ్లు, స్నాక్స్ కూడా బస్సులోనే ఏర్పాటు చేసి కావలి రవాణాశాఖ వాళ్లు తమ ఔదార్యం చూపించుకున్నారు. సకాలంలో బస్సులు ఏర్పాటు చేసిన కాలేజీ యాజమాన్యాలకు బ్రేక్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కాగా ఎంసెట్ విద్యార్థుల కోసం కావలి రవాణాశాఖ వాళ్లు చూపిన చొరవను విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశంసిస్తున్నారు.

# క్రీడామైదానాలకు పూర్వవిద్యార్థుల సహకారం



కొండాపురం మండలంలోని కొమ్మి జడ్పీ హైస్కూల్‌లో క్రీడామైదానాన్ని అభివృద్ధి పరిచేందుకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు ముందుకొచ్చారు. ఈ పాఠశాలలో సుమారు ఎకరా మైదానం పిచ్చి మొక్కలతో నిండిపోయి పాము, పుట్రకు నిలయంగా మారిపోయింది. ఈ పిచ్చి మొక్కల వల్ల విద్యార్థులు ఎలాంటి ఆటలు ఆడలేకపోతున్నారు. స్థానిక స్కూల్ కమిటి ఛైర్మెన్ కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు హజరత్తయ్యలు ఈ క్రీడామైదానాన్ని బాగుచేయాలని సంకల్పించి పూర్వవిద్యార్థులకు దీని గురించి చెప్పారు. ఈ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు దీనికి స్పందించారు. ఈ పాఠశాలలో చదివి డాక్టర్లుగా ఇంజనీర్లుగా వివిధ రంగాల్లో దేశవిదేశాల్లో స్థిరపడిన వాళ్లు ఎందరో ఉన్నారు. వారిలో ప్రవాసభారతీయుడు కాసు వీరశేఖర్ ముందుగా స్పందించి 10వేల రూపాయలను క్రీడామైదానం అభివృద్ధికి అందజేశారు. అలాగే మల్లిబోయిన కృష్ణ, పల్లపనాయుడులు కూడా ఈ మైదాన అభివృద్ధిలో పాలుపంచుకున్నారు. ఈ మైదానం అభివృద్ధికి ఇంతవరకు 25వేల రూపాయలు సేకరించారు. ఈ మైదానాన్ని అభివృద్ధి చేయడంతో పాటు మొక్కలు నాటడం, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడం వంటివి చేస్తామని స్కూల్ కమిటి ఛైర్మెన్ తెలిపారు.

# ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చా!

## - వంటేరు వేణుగోపాల్‌రెడ్డి



తాను ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చానని మాజీ శాసనసభ్యులు వంటేరు వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం కావలిలోని వెంగళరావునగర్ 25వ వార్డులోని వంటేరు వరదారెడ్డి, తాయారమ్మల పేరు మీద నిర్మించివున్న మునిసిపల్ పార్క్‌ను ఆయన పరిశీలించారు. ఈ పార్కును అందంగా రూపుదిద్దేందుకు పూలమొక్కలు, చిన్నారులకు ఆటవస్తువులు, పార్కులో కాసేపు విశ్రమించేందుకు స్థానికులకు అవసరమైన బెంచీలు వగైరాలకు తాను సొంతనిధులను అందజేస్తానని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 1994లో టిడిపి తరఫున కావలి నియోజకవర్గంలో తాను ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయినా, ప్రజల సేవ కోసం తాను ఎల్లవేళలా ముందున్నానన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం తాను నిరంతర పోరాటం సాగించి, కావలి ప్రజలకు మంచినీటి సమస్యను పరిష్కరించానన్నారు. 1999లో మళ్ళీ టిడిపి నుంచి పోటీ చేసి, ఎమ్మెల్యేగా గెలిచి, సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌కు శ్రీకారం చుట్టి కావలి పట్టణ ప్రజలకు శాశ్వతంగా తాగునీటి సమస్య లేకుండా చేశానన్నారు. తాను ఎమ్మెల్యేగా వున్నప్పుడు కావలి ఆర్టీసి అభివృద్ధికి, ప్రయాణీకులకు బస్సుల వసతి కల్పించేందుకు ఎంతగానో కృషి చేశానన్నారు. మారుమూల గ్రామాలకు సైతం బస్సులు నడిచేలా కృషిచేశామన్నారు. అప్పటి అధికారులు కూడా తనకెంతగానో సహకరించారని, అయితే ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేవని ఆయన అన్నారు. ఈ పార్కును నెలకొల్పిన తర్వాత కొంత కాలానికి మునిసిపాలిటీ పరిధిలోకి చేరిందని, అప్పటినుంచి ఈ పార్కు ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. ప్రస్తుతం ఈ పార్కు దీనస్థితిని చూస్తుంటే బాధ కలుగుతుందన్నారు. గతంలో తాను, గ్రంధి యానాదిశెట్టి పార్టీలు వేరైనప్పటికీ, పార్టీలకు అతీతంగా పార్కును అభివృద్ధి చేశామన్నారు. రాజకీయంగా నాయకులకు సమస్యలున్నప్పటికీ, ప్రజాసేవ, పట్టణాభివృద్ధికి ఎలాంటి ఇబ్బందీ జరుగకూడదన్నారు. తాను ఎమ్మెల్యేగా వున్నప్పుడు ఎన్నో ప్రజోపయోగకరమైన పనులు చేపట్టామన్నారు. ఇకనుంచి స్వచ్ఛంధ కార్యక్రమాల పట్ల మరింత శ్రద్ధ చూపుతూ కావలి ప్రజలకు తనవంతు సేవలందిస్తానని అన్నారు. విద్యావంతురాలైన నెల్లూరు సీతారావమ్మ వార్డు కౌన్సిలర్‌గా వుండడం ఇక్కడి ప్రజలకు అదృష్టమని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సీతారావమ్మ, గుడ్‌మెన్స్ సేవాసంస్థ అధ్యక్షులు ఎస్.బ్రహ్మయ్య, లోక్‌సత్తా నాయకులు మాలకొండారెడ్డి, వికలాంగుల సేవా సంఘం నాయకులు బాషా, వెంకటేశ్వరరెడ్డి లు పాల్గొన్నారు.

# మాటలు ఘనం - చేతలు శూన్యం



రాజకీయ నాయకులు, అధికారుల మాటలు మాత్రం ఘనంగా ఉంటాయని, కానీ వారు చేతలలో పని మాత్రం శూన్యమని కావలిలోని పెద్దపవని రోడ్లలో నివాసముంటున్న పేదప్రజలు ఆరోపిస్తున్నారు. వేసవికాలం కావడంతో నీటి కొరత పట్టణంలో తీవ్రమైంది. ముఖ్యంగా పెద్దపవని రోడ్డులో వైకుంటపురంలో నివాసముంటున్న ప్రజలు వేసవి ఆరంభం నుండే నీటికొరతను ఎదుర్కొంటున్నారు. వీరి సమస్యపై పలు మార్లు ఆ ప్రాంత నాయకులకు, మున్సిపల్ అధికారులకు వివరించినా పట్టించుకున్న నాధుడే లేడని ఆవేదన చెందుతున్నారు. ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు మాటలు ఘనంగా చెప్పి వెళుతుంటారు. నాయకులు వచ్చినప్పుడు అధికారులు ఈ ప్రాంతానికి అది చేశాం, ఇది చేశాం, ఇంకేదైనా కావాలంటే చెప్పండి చేస్తామంటారు. వారు వెళ్లిపోయాక ఏది కావాలన్నా పట్టించుకోరని వారు మండిపడుతున్నారు. ఈ ప్రాంతానికి మున్సిపల్ పైపులైను కూడా లేవు. వీరు అక్కడున్న చేతి పంపులను ఆశ్రయించాల్సిందే. అవి కూడా మరమ్మత్తులకు గురికావడం, నీరు అడుగంటి పోవడంతో గంటల తరబడి నిలబడినా ఫలితంలేదని అంటున్నారు. గత వేసవిలో ఎన్నికల సమయంలో పోటీపడి ట్యాంకర్లతో నీరు అందించిన నాయకులు ఇప్పుడు ఎక్కడికి పోయారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు ఈ ప్రాంతానికి నీరు సరఫరా చేసి, చేతి పంపులకు మరమ్మత్తులను చేయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


నీతికి నిజాయితీకి నిలువుటద్దంగా నిలుస్తూ...
నిష్పాక్షిక జర్నలిజంతో ముందుకు సాగుతున్న
లాయర్ తెలుగు వారపత్రిక
కావలిలో కార్యాలయాన్ని ప్రారంభించిన సందర్భంగా
నా హృదయపూర్వక శుభాకాంక్షలు.



తిరివీధి ప్రసాద్
డైరెక్టర్ AMC, కావలి



పాఠకులకు కానుక... వాస్తవాల వేదిక
లాయర్ వారపత్రిక
ప్రాంతీయ కార్యాలయాన్ని కావలిలో నెల్లూరుజిల్లా ఎస్పీ
డా॥ గజరావు భూపాల్ గారి చేతుల మీదుగా
ప్రారంభించిన శుభసందర్భంగా
మా శుభాభినందనలు.



కె.రమాదేవి
అధ్యక్షురాలు



ఎన్.అంజమ్మ
డైరెక్టర్



వి.కామాక్షి
డైరెక్టర్



వై.తిరుమల
డైరెక్టర్



ఎన్.కళ్యాణి
మేనేజర్

పి.రమణమ్మ
డైరెక్టర్

ఎం.సుగుణమ్మ
డైరెక్టర్

కె.కవిత
డైరెక్టర్

టి.మాధవి
డైరెక్టర్

జి.జయమ్మ
డైరెక్టర్

మైత్రి మహిళా బ్యాంక్
జనతాపేట నార్త్, కావలి - 524 202. ఫోన్. 08626 - 244114.

# కావలిలో లాయర్ కార్యాలయం

## జిల్లా యస్.పి.చే ప్రారంభం




**గత 34సంవత్సరాలుగా ప్రపంచ వ్యాప్తంగా వున్న నెల్లూరీయుల మనసులు దోచుకుంటున్న నెల్లూరీయుల ప్రియపత్రిక 'లాయర్' వారపత్రిక జిల్లాలో మూడవశాఖను కావలిలో ఏర్పాటు చేసుకుంది.**

రూరల్ ప్రాంత వాసులకు ముఖ్యంగా గ్రామీణ ప్రజలకు చేరువ కావాలనే లక్ష్యంతో 4సంవత్సరాల క్రితం గూడూరులో రెండవ గూడు ఏర్పాటు చేసుకున్న 'లాయర్' ఇప్పుడు నెల్లూరుకు ఉత్తరం వైపున కావలిలో మరో శాఖకు శ్రీకారం చుట్టింది.

మే 10వ తేదీ ఆదివారం ఉదయం 10గంటలా 55నిముషాలకు నెల్లూరుజిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డా॥ గజరావుభూపాల్ 'లాయర్' శాఖ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా యస్.పి మాట్లాడుతూ స్థానిక వార్తల సమాహారంతో వారం వారం జిల్లా వాసులను అలరిస్తున్న 'లాయర్' జిల్లాలోని ప్రధాన కేంద్రాలలో తమ శాఖలను ప్రారంభించుకుని పాఠకులకు మరింత చేరువకావాలని ప్రయత్నం చేయడం అభినందనీయమని అన్నారు. అనంతరం జరిగిన సభలో కావలి మాజీ శాసనసభ్యులు మరియు రాజధాని నిర్మాణ కమిటి సభ్యులు బీద మస్తాన్‌రావు, కావలి మున్సిపల్ ఛైర్మెన్ అలేఖ్య, బీజేపీ నాయకుడు కందుకూరు సత్యనారాయణ, సీనియర్ వైద్యనిపుణులు డా॥ లక్ష్మీనరసారెడ్డి, మునిసిపల్ వైస్‌ఛైర్మెన్ భరత్‌కుమార్, వై.యస్.ఆర్.సి.పి ఫ్లోర్‌లీడర్ నారాయణ, 'లాయర్' సంగ్రాహకులు శివప్రభాత్‌రెడ్డి పాల్గొన్నారు.












కార్యక్రమానికి అధ్యక్షత వహించిన శివప్రభాత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రాంతీయవార్తలను సమర్ధవంతంగా సేకరించి స్థానిక పాఠకులకు అందించే లక్ష్యంతోనే తాము కావలి శాఖను ప్రారంభించామని, గతంలో ప్రారంభించిన గూడూరుశాఖ విజయవంతం కావడమే కాకుండా గూడూరు పరిసర ప్రాంతాల్లో విశేష స్థాయిలో పాఠకులను అభిమానులను 'లాయర్' సంపాదించుకోగలిగిందని, అదే స్ఫూర్తితో నేడు కావలి కార్యాలయాన్ని ఏర్పాటు చేశామని చెప్పాడు.

కావలి ప్రాంతం చైతన్యవంతుల పుట్టినిల్లని, వ్యాపారపరంగా, రాజకీయపరంగానే కాకుండా సాహిత్య, కళారంగాలలో సైతం నిష్ణాతులైన వ్యక్తులు కావలి నుండి వున్నారని, ఇలాంటి ప్రాంతంలో తమ శాఖ కార్యాలయం ప్రారంభించుకోవడం ఆనందంగా వుందన్నాడు.

మాజీ శాసనసభ్యుడు బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ ఎన్నో కష్టనష్టాలకోర్చి చిన్న పత్రికల యాజమాన్యాలు పత్రికలు నడుపుతున్నాయన్నారు. ముఖ్యంగా వార్తలతో పాటు ప్రింటింగ్‌లో సైతం ఎక్కడా రాజీపడకుండా పాఠకులకు చేరుతున్న 'లాయర్' వారపత్రిక జిల్లా స్థానిక పత్రికల రంగంలోనే ఓ సంచలనం అని, నేడు ముఖ్యంగా "కావలి" నియోజకవర్గంలో తమ కార్యాలయం ద్వారా కావలి పరిసర ప్రాంత వార్తలతో కావలివాసుల మనసును దోచుకోబోతున్నారని, అందరూ పత్రికను చదివి యాజమాన్య కృషిని ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. రానున్న రోజుల్లో అభివృద్ధి మొత్తం నెల్లూరుకు ఉత్తరం వైపే వుంటుందని, అందులో భాగంగా కావలిలో మంచి అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టబోతున్నామని, ఇలాంటి తరుణంలోనే 'లాయర్' పత్రిక కార్యాలయం కావలిలో ప్రారంభించుకోవడం సముచితమైన నిర్ణయమని యాజమాన్యాన్ని అభినందించారు.

మంచిని చప్పట్లతో, చెడుని చీవాట్లతో సత్కరించడం 'లాయర్' ఆనవాయితీ అని, లాయర్ వ్యవస్థాపకుడు తుంగా రాజగోపాలరెడ్డి యముడికి సైతం భయపడకుండా వాస్తవాలను ప్రజలకు అందించేవాడని, అదే వాడిని, వేడిని విడవకుండా ఆయన బాణిలోనే నేడు పత్రికను ఆయన వారసుడు నడపడం తనకు ఆనందంగా వుందని సీనియర్ వైద్యనిపుణులు డా॥ సి.యల్.యన్.రెడ్డి అన్నారు.

కావలివాసులు చాలా మంచివారని, తన జన్మస్థలం కావలి కాకపోయినా కావలిపై మక్కువతో తాను కావలిలో స్థిరపడిపోయానని చెప్పారు. కాస్త ఆలస్యమైనా కావలిలో 'లాయర్' కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవడం తనకు చాలా సంతోషాన్నిస్తోందని అన్నారు.

మునిసిపల్ ఛైర్‌పర్సన్ శ్రీమతి అలేఖ్య ప్రసంగిస్తూ పత్రికలు ప్రభుత్వానికి ప్రజలకీ మధ్య వారధులని, నిత్యం సమాజంలో జరిగే విషయాలని ప్రజలకు చేరవేయడంలో కీలకపాత్ర పత్రికలదేనని అన్నారు. స్థానిక వార్తలతో 'లాయర్' కావలివాసులకు మరింత చేరువ కావడం అభినందనీయమని అన్నారు.

బీజేపీ నాయకులు కందుకూరు సత్యనారాయణ కావలి అభివృద్ధిపై మాట్లాడుతూ టెక్స్‌టైల్ హబ్‌గా కావలిని తీర్చిదిద్దే లక్ష్యంతో భవిష్యత్తులో కావలి సమీపంలో టెక్స్‌టైల్ పార్క్‌ని ఏర్పాటు చేయడానికి వెంకయ్య నాయుడి నేతృత్వంలో ప్రయత్నాలు చేస్తున్నామని, రానున్న రోజుల్లో ఎయిర్‌పోర్ట్‌తో పాటు ఇంకా పలు పరిశ్రమలకు కావలి వేదిక కాబోతుందని, ఇవన్నీ అమలైనరోజు ఆంధ్రప్రాంత రాజధాని అమరావతి కంటే ఎక్కువ అభివృద్ధి కావలిలో దర్శనమిచ్చి రాష్ట్రంలో అగ్రగామిగా కావలి ప్రాంతం భాసిల్లబోతోందని చెప్పారు. ఇలాంటి తరుణంలో కావలి ప్రాంతంలో తమ శాఖ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని 'లాయర్' పత్రిక యాజమాన్యం సంకల్పించడం వారి ముందుచూపుకి నిదర్శనమన్నారు.

మున్సిపల్ వైస్‌ఛైర్మెన్ భరత్‌కుమార్‌తో పాటు కనమర్లపూడి వెంకటనారాయణ, సీనియర్ సాహితీవేత్త కల్లయ్యలు ఈ సభలో ప్రసంగించారు.

ముందుగా కావలి ఘంటశాల రామచంద్రయ్య ప్రార్ధనతో మొదలైన ఈ కార్యక్రమాన్ని 'లాయర్' పత్రిక గౌరవ సలహాదారు, సీనియర్ పాత్రికేయులు జలదంకి ప్రభాకర్ నిర్వహించాడు.

88సంవత్సరాల వయస్సులో తన వృత్తిలో 62సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 888లు పురస్కరించుకుని డా॥ లక్ష్మీనరసారెడ్డికి ఈ కార్యక్రమంలో ఆత్మీయసత్కారం జరిగింది.

మాజీశాసనసభ్యుడు కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డితో పాటు కావలి మాజీ మున్సిపల్ ఛైర్మెన్ నగళ్ళ శ్రీనివాస కిరణ్, పట్టణ టిడిపి నాయకులు మలిశెట్టి వెంకటేశ్వర్లు, పాలడుగు రంగారావు, మెట్టుకూరు చిరంజీవి రెడ్డి, అమరా వేదగిరిగుప్తా, నాయుడు రాంప్రసాద్, ఆత్మకూరు బ్రహ్మయ్య, గాదంశెట్టి వేణుగోపాల్, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి చింతాల వెంకటరావు, పట్టణ ప్రముఖులు అనుమాలశెట్టి వాసు, రామకృష్ణ, శివ, మోడరన్ నరసింహారావు, అమరా సుబ్బారావుగుప్తా, వి.వి.నరసింహాచారి, గంథం ప్రసన్నాంజనేయులు, లోక్‌సత్తా మాలకొండారెడ్డి, తిరివీధి ప్రకాశ్, రెడ్‌క్రాస్ కార్యదర్శి రవిప్రకాశ్, కన్నయ్య, చిన్నయ్య, బి.పి.యస్. ప్రకాశరావు, గోసల గోపాలరెడ్డి, శ్రీరామ్‌మాల్యాద్రి, మైత్రి డ్యాన్స్ రమాదేవి, అశ్లీల ప్రతిఘటనా వేదిక నాయకురాలు శారద, రైతు నాయకులు సదాశివరెడ్డి, రాజారెడ్డి సుధాకర్, నక్కల కృష్ణయ్య యాదవ్, జనవిజ్ఞాన వేదిక నాయకులు ఎస్.కె.ఖాదర్‌బాషా, నంబూరు శ్రీనివాసులురెడ్డి, డిఎస్పీ డి.మోహన్‌రావు, సిఐలు వెంకట్రావ్, మంగారావు, నెల్లూరుకు చెందిన పలువురు ప్రముఖులు, 'లాయర్' అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.










# 'అ'న్యాయాన్ని ప్రశ్నిస్తున్న తీర్పులు

***క్రింది కోర్టు శిక్ష వేస్తుంది, పైకోర్టు అదే శిక్షను రద్దు చేస్తుంది. ఒక కోర్టు ఇది నేరమంటుంది, మరో కోర్టు ఇది నేరం పరిధిలోకి రాదంటుంది. ఈ తేడా ఎక్కడొస్తుంది? రాజ్యాంగంలోని చట్టాలలోనా? లేక తీర్పులిస్తున్న న్యాయమూర్తులలోనా? ఒకే దేశంలో ఒకే న్యాయవ్యవస్థలో ఈ తీర్పుల తేడాలేమిటి? అని సామాన్యులు సైతం అయోమయానికి గురవుతున్నారు.***

భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో న్యాయవ్యవస్థకు అత్యంత ప్రాధాన్యత వుంది. చట్టాలను చేసే ప్రభుత్వాలను సైతం తప్పు చేస్తే అదిలించి, కదిలించేది న్యాయవ్యవస్థే. కీలకమైన ఎన్నో వివాదాలను పరిష్కరించడం ద్వారా ఘనకీర్తిని మూటగట్టుకున్న మన న్యాయవ్యవస్థ, కొన్ని సంఘటనల్లో ఇస్తున్న తీర్పులు సామాన్య ప్రజలను ఆశ్చర్యపరుస్తున్నాయి. ప్రస్తుతం రెండు కేసుల్లో న్యాయస్థానాలు వెలువరించిన విభిన్న తీర్పులు దేశ ప్రజలందరినీ అయోమయానికి గురిచేస్తున్నాయి.

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో కొన్ని నెలల క్రితమే బెంగుళూరు సిబిఐ కోర్టు తమిళనాడు మాజీముఖ్యమంత్రి జయలలితకు ఆరేళ్ల జైలు శిక్ష విధించింది. ఒక కోర్టు విచారణ అనంతరం శిక్ష విధించిందంటే న్యాయ విచారణ జరిగి సాక్ష్యాధారాలు బలంగా ఉంటేనే శిక్ష విధిస్తారు. ఈ తీర్పుపై జయ హైకోర్టులో అప్పీలు వేసింది. మళ్లీ విచారణల అనంతరం మొన్ననే హైకోర్టు ఆమెకు విధించిన శిక్షను రద్దు చేసింది. అంటే ఇక్కడ జయలలిత ఏ నేరమూ చేయలేదని అర్థం. ఆ లెక్కన తీసుకుంటే ఆమెకు ఆరేళ్ల జైలు శిక్ష వేసిన విచారణ కోర్టు తప్పు చేసినట్లా? సాక్ష్యాధారాలు, విచారణాంశాలు పరిగణనలోకి తీసుకోకుండానే శిక్ష విధించినట్లా? సిబిఐ వాళ్లు పట్టుకున్న జయలలిత ఆస్తులన్నీ సక్రమమైనవేనా?.. ఇవన్నీ సామాన్యులకు కలిగే ప్రశ్నలే!

బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్ కేసులో కూడా ఇదే వైఖరి. 13ఏళ్ల క్రితం తప్పతాగి కారు నడిపి ఫుట్‌పాత్‌పై పడుకున్న ఓ అనాథ మరణానికి, నలుగురు ఆసుపత్రి పాలు కావడానికి కారణమైన కేసులో సల్మాన్‌ఖాన్‌కు ఇటీవలే బాంబే కోర్టు 5ఏళ్ల జైలు శిక్ష విధించింది. సల్మాన్‌కు జైలు శిక్ష అనగానే అభిమానులు చేయని నేరానికేదో ఆయనకు శిక్ష విధించినట్లుగా ఫీలయ్యారు. ఎట్టకేలకు ఆయనకు బెయిల్ రావడం ఆశ్చర్యకరం!

అయితే, ఏ కోర్టు తీర్పు ఎలా వున్నా... చివరి తీర్పు సుప్రీం కోర్టుదే! జయలలిత కేసు విషయంలో కరుణానిధి, సుబ్రహ్మణ్యం స్వామి వంటి వారు హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టును ఆశ్రయిస్తామని చెబుతున్నారు. జయలలిత కేసు విచారణకు కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం దాదాపు 100కోట్లు వెచ్చించగా ఈ సొమ్మునంతా తిరిగి చెల్లించాలని ఆ రాష్ట్ర ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఏదేమైనా, ఆమె సంపాదించిన ఆస్తి సక్రమమా? లేక అక్రమమా? అనేది సర్వోన్నత న్యాయస్థానమే తేల్చాల్సి వుందని ప్రజలు భావిస్తున్నారు.



## నెల్లూరు నేతలకు

# ఈ 'సారీ' అంతేనా?



**శాసనమండలి... జిల్లాలో ముఖ్యంగా ఇద్దరు నాయకులను ఊరిస్తూ, అందని ద్రాక్ష పండులా మారుతున్న పదవి. ఎమ్మెల్సీల ఖాళీలు వచ్చినప్పుడల్లా వీరిద్దరి పేర్లు తెరమీదకు రావడం, తర్వాత వెనక్కిపోవడం పరిపాటిగా మారింది. ఆ ఇద్దరు నాయకుల్లో ఒకరు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అయితే రెండో వ్యక్తి పార్టీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర.**

వీళ్లిద్దరూ పార్టీ కోసం కష్టపడ్డవాళ్లే! పార్టీ ప్రతిపక్షంలో వున్న పదేళ్లు కూడా పార్టీని మోసినవాళ్లే! చంద్రబాబు ఎమ్మెల్సీ ఇవ్వడానికి పార్టీ పరంగా అన్ని విధాలా అర్హులు ఈ ఇద్దరు. కాని ఎమ్మెల్సీల భర్తీ విషయంలో వీరిద్దరికీ ఎప్పటికప్పుడు నిరాశే ఎదురవుతుంది.

2014 ఎన్నికల్లో సర్వేపల్లి నుండి సోమిరెడ్డి గెలిచివుంటే ఈ ఎమ్మెల్సీ పితలాటకం వుండేది కాదు. కాని సర్వేపల్లి వద్దంటున్నా చంద్రబాబు ఆయనను పోటీకి దించారు. ఓడిపోతే న్యాయం చేస్తానని ఆరోజే మాటిచ్చాడు. సోమిరెడ్డి ఓడిపోయినా పార్టీ అధికారంలోకి వచ్చింది. అయితే జిల్లాలో పార్టీకి మూడే సీట్లు వచ్చాయి. ఈ జిల్లాకు చెందిన నారాయణకు ఎమ్మెల్సీ, మంత్రి పదవి ఇచ్చారు. ఆయన వల్ల జిల్లాలో పార్టీ కేడర్‌కు ఎలాంటి ఉపయోగం లేదు. కార్యకర్తలకు అందుబాటులో ఉండే సోమిరెడ్డికి ఎమ్మెల్సీ ఇవ్వాలనేది దేశం కార్యకర్తల కోరిక. ఆయనైతే చిన్నదానికి పెద్దదానికి అందుబాటులో వుంటాడు. ఏ కార్యకర్త పోయి పని చెప్పినా ముందు అధికారులకు ఫోన్ చేసి మాట్లాడుతాడు. ఈ మాత్రం స్పందన మంత్రి నారాయణ వద్ద ఉండదు. అదీగాక ఆయనది 'చిక్కడు దొరకడు' టైపు. కాబట్టే సోమిరెడ్డికి ఎమ్మెల్సీ రావాలనేది కార్యకర్తల అభిప్రాయం. సోమిరెడ్డి తన టాలెంట్‌ను ప్రూవ్ చేసుకోవడానికి నానా తంటాలు పడుతున్నాడు. ముఖ్యంగా ఎవరూ విమర్శించని విధంగా జగన్‌ను విమర్శిస్తున్నాడు. ఇన్ని చేస్తున్నా చంద్రబాబు ఇంతవరకు సోమిరెడ్డిని కనికరించలేదు. 'రెడ్డి' సామాజికవర్గంలో ఇంతవరకు ఎమ్మెల్సీ ఇవ్వలేదు. ఇస్తేగిస్తే ఇప్పుడే ఇవ్వాలి. లేకుంటే ఈసారి కూడా అంతే సంగతులు.

బీద రవిచంద్రదైతే మరీ దయనీయ పరిస్థితి. నెలక్రితమే ఎమ్మెల్సీ పదవి ఆయన నోటిదాకా వచ్చింది. నామినేషన్ ఫారాలు కూడా భర్తీ చేసాడు, చివరి నిముషంలో ఏం జరిగిందో ఏమో... రవిచంద్ర పేరు మారిపోయింది. ఆయన నామినేషన్ ఫారాలను స్వదస్తూరితో భర్తీ చేసిన తిప్పేస్వామిని ఎమ్మెల్సీ వరించింది. రవిచంద్రకు ఇప్పటిదాకా ఎలాంటి పదవి రాలేదు. ఇప్పుడు మళ్లీ ఎమ్మెల్సీపైనే ఆయన ఆశలు పెట్టుకున్నాడు.

ఎమ్మెల్యేల కోటాలో నాలుగు ఎమ్మెల్సీలను భర్తీ చేయనున్నారు. శాసనసభ్యుల సంఖ్య ప్రకారం తెదేపాకు 3, వైకాపాకు ఒకటి దక్కనున్నాయి. తెదేపా మూడింటిలో ఒకటి బీజేపీ అడుగుతుంది. మిగిలిన రెండింటిని చంద్రబాబు ఏ విధంగా పంచుతాడన్నదే ప్రశ్న? ఒకే జిల్లాకు రెండు ఇవ్వడు. పార్టీకి చాకిరి చేసిన వాళ్లను లెక్కలోకి తీసుకుంటే ఈ ఇద్దరిలో ఒకరికి అవకాశముంటుంది. కాని చంద్రబాబు ఈ పార్టీ చాకిరీని పెద్దగా పట్టించుకోడు. కులాల వారీగా లెక్కలోకి తీసుకుంటే మొన్న ఎమ్మెల్సీ ఇచ్చిన తిప్పేస్వామి యాదవ వర్గం కాబట్టి బీదకు అవకాశం రాకపోవచ్చు.

ఈసారన్నా రెడ్లకు ప్రాధాన్యత ఇవ్వాలనుకుంటే సోమిరెడ్డికి ఛాన్సుంటుంది. అలాకాకుండా ఎందుకొచ్చిన తలనొప్పనుకుని మైనార్టీలకొకటి, బీసీ లేదా ఎస్సీ, ఎస్టీలకొకటి అంటే... ఆశావాదుల నోట్లో మళ్లీ మట్టి పడ్డట్లే!




# ఉత్తరక్రియలు

మా ఇంటి దీపం, మా అమ్మ

**మాగుంట శ్యామలమ్మ గారు**

(లేట్ గోవిందరెడ్డి గారి సతీమణి)

చిన్నచెరుకూరు గ్రామం, నెల్లూరుజిల్లా.

తే. 11-05-2015ది సోమవారం పరమపదించినారు.

*వారి ఆత్మశాంతికై భగవంతుని ప్రార్థిస్తున్నాం.*

ఇట్లు : కుమారులు

మాగుంట వెంకటనారాయణరెడ్డి

మాగుంట పట్టాభిరామిరెడ్డి

మాగుంట శివకుమార్‌రెడ్డి

**పెద్దకర్మ**

తే.21.05.2015ది గురువారం, ఉ॥ 10.00గం.లకు నెల్లూరుజిల్లా, చిన్నచెరుకూరు గ్రామంలోని మా స్వగృహమునందు జరుగును. బంధుమిత్రులకు తెలియజేయడమైనది.


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com